తెలుగు దినపత్రిక
# సిరి
People's Voice
వార్త పత్రిక
RNI TG TEL/ 26/A0381
08-08-2026
శనివారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 181
PUBLISHED FROM HYDERABAD
పేజీలు-8 వెల:రూ.4 /–



తెలుగు దినపత్రిక
సిరి
People's Voice
RNI:TGTEL/26/A0381
siridailynews@gmail.com
/siridailynews
@siridailynews
విలేకరులు కావలెను
ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.
99897 78881, 7702344303, 9440451575




## రాష్ట్ర సుభిక్షం కోసం మహా వరుణ యాగం

2

- నాగార్జునసాగర్‌లో ఆగస్టు 10న వైదిక క్రతువు
- వర్షాలు సమృద్ధిగా కురవాలని ప్రభుత్వ ఆధ్వర్యంలో యాగం
- 11 హోమకుండాల్లో 108 మంది ఋత్వికులు, వేద పండితులతో నిర్వహణ
- కృష్ణా, గోదావరి నదులకు భారీగా వరద నీరు రావాలని ప్రత్యేక ప్రార్థనలు
- మధ్యాహ్నం 3.24 గంటలకు పూర్ణాహుతి.. పాల్గొననున్న సీఎం రేవంత్‌రెడ్డి



## నీటిపారుదల సలహా మండళ్ల పునరుద్ధరణ

- ఎల్‌నినోపై రైతులకు ముందస్తు మార్గదర్శకాలు
- సాగర్, ఎస్ఆర్ఎస్‌పీలో నీటి నిల్వలు ఇంకా తక్కువే
- తాగునీటి నిల్వలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశం
- రాష్ట్రవ్యాప్తంగా 1.06 కోట్ల రేషన్ స్మార్ట్ కార్డులు
- మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి

2

# ఓసీ.. ఏది ఒరిజినల్?!

## ఉన్నతాధికారుల సంతకాలు ఫోర్జరీ చేసి నకిలీ పత్రాలు

- 54 కళాశాలల్లో వెలుగులోకి వచ్చిన అక్రమాలు
- శాఖల మధ్య సమన్వయ లోపమే అక్రమార్కులకు వరం
- విచారిస్తే బయటపడనున్న వేలాది నకిలీ సర్టిఫికెట్ల గుట్టు
- నకిలీ ఓసీల వ్యవహారంతో అన్ని శాఖల్లో గుబులు
- శాఖల మధ్య సమన్వయమే సమస్యకు కారణమా?
- హైదరాబాద్‌లో వెలుగుచూసిన నకిలీ ఓసీల కుంభకోణం

**గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఇటీవల ప్రైవేట్ కళాశాలల అనుమతుల కోసం ఉన్నతాధికారుల సంతకాలనే ఏకంగా ఫోర్జరీ చేసి నకిలీ ఆక్యుపేషన్ సర్టిఫికెట్లు పొందిన ఉదంతాలు తీవ్ర సంచలనం రేపుతున్నాయి. ఇప్పటివరకు నిర్వహించిన ప్రాథమిక తనిఖీల్లోనే ఏకంగా 54 కళాశాలల్లో ఇలా అనుమతుల కోసం తప్పడు ఓసీలు సమర్పించినట్లు వెలుగులోకి వచ్చింది. ఇంకా అనేక కళాశాలల అనుమతి పత్రాలపై అధికారుల విచారణ ముమ్మరంగా కొనసాగుతోంది. బయటపడ్డవి వందల్లో ఉంటే, లోతుగా విచారిస్తే పడాల్సినవి వేలల్లో ఉంటాయని తెలుస్తోంది. ఈ సంచలన వ్యవహారం ప్రభుత్వ శాఖల మధ్య ఉన్న సాంకేతిక సమన్వయ లోపాన్ని స్పష్టంగా ఎండగడుతోంది.**

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:**

ఓసీ మంజూరు వెనుక అసలు నిబంధనలేంటి? జిహెచ్ఎంసి జారీ చేసే ఆక్యుపేషన్ సర్టిఫికెట్ అనేది నిర్మించిన భవనానికి సంబంధించిన అన్ని చట్టబద్ధమైన నిబంధనలు పాటిస్తేనే ఇచ్చే అత్యంత కీలకమైన ధ్రువపత్రం. ఇందుకోసం భవన నిర్మాణంలో ఫైర్ సేఫ్టీ, పీసీబీ, హైడ్రా వంటి విభాగాలు ఆ భవనం అన్ని నిబంధనలకూ లోబడి ఉందని ధ్రువీకరించాల్సి ఉంటుంది. వీటిని సాంకేతికంగా పోర్టల్‌లో అప్‌డేట్ చేసిన తర్వాతే అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన జరిపి ఓసీ జారీ చేస్తారు. కానీ కొన్ని కళాశాల యాజమాన్యాలు ఏకంగా ఉన్నతాధికారుల డిజిటల్ సంతకాలు, ముద్రలను ఫోర్జరీ చేసి నకిలీ ఓసీలు సృష్టించడం అధికారుల నిర్లక్ష్యాన్ని బయటపెట్టింది.


**అసలు తప్పెక్కడ జరిగింది?**

జిహెచ్ఎంసి జారీ చేసే ఓసీ అసలైందా లేక నకిలీదా అని సాంకేతికంగా తెలుసుకునే వెసులుబాటు ప్రస్తుతం కేవలం విద్యుత్ శాఖ, ఆయా జిల్లాల కలెక్టర్లు, మరియు జలమండలికి మాత్రమే ఉంది. భవన నిర్మాణ అనుమతి ఇచ్చినప్పుడే ఈ శాఖలకు సమాచారం వెళ్తుంది. అయితే ఈ ఫోర్జరీ దందాలో కళాశాల యాజమాన్యాలు తమ అనుమతుల కోసం తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డుకు నకిలీ ఓసీలను జతచేసి సమర్పించాయి. ఇంటర్ బోర్డుకు, జిహెచ్ఎంసి పోర్టల్‌కు మధ్య ఎలాంటి సాంకేతిక సమన్వయం లేకపోవడమే ఈ భారీ

మిగతా 3వ పేజీలో..

## నా భర్తను చంపేస్తావా.. నన్ను చావమంటావా?!

- ప్రియుడికి వాట్సాప్‌లో మెసేజ్ పంపిన వివాహిత
- ప్రియురాలి కోసం భర్తపై హత్యాయత్నం చేసిన ప్రియుడు
- భార్య ఫోన్ చాటింగ్ చూసి షాక్ తిన్న భర్త
- మహబూబాబాద్ జిల్లా డోర్నకల్లు మండలంలో ఘటన
- కొరియర్ బాయ్‌తో వివాహేతర సంబంధం పెట్టుకున్న మహిళ
- విషయం తెలిసి పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టిన భర్త
- ఆధారాలతో పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు
- = కేసు నమోదు చేసి రక్షణ కల్పిస్తామని సీఐ హామీ



3

- పదేళ్లు పూర్తి చేసుకున్న పథకం.. దేశానికి ఆదర్శంగా నిలిచిందన్న హరీశ్‌రావు
- ఫ్లోరోసిస్ నిర్మూలనలో మిషన్ భగీరథ కీలక పాత్ర
- 'హర్ ఘర్ జల్'కు ఈ ప్రాజెక్టే ఆదర్శమని వ్యాఖ్య
- కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో పథకం నిర్వీర్యమవుతోందని ఆరోపణ

## తాగునీటి విప్లవానికి నిదర్శనం మిషన్ భగీరథ



**హైదరాబాద్, సిరి న్యూస్:**

తెలంగాణలో ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు అందించాలనే లక్ష్యంతో చేపట్టిన మిషన్ భగీరథ పథకం పదేళ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు

మిగతా 2వ పేజీలో..



## పార్లమెంట్‌లో చురుగ్గా వ్యవహరించండి

- ఎన్డీఏ ఎంపీలకు ప్రధాని మోదీ సూచనలు
- సభా కార్యకలాపాల్లో చురుకైన భాగస్వామ్యం
- పార్లమెంట్ చరిత్రను అధ్యయనం చేసి చర్చలకు సిద్ధం కావాలి
- రాష్ట్రాలు, నియోజకవర్గాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
- ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల ఎంపీలకు అండగా ఉంటానని భరోసా

4



## జీఎస్టీ ఎగవేతకు ఏఐతో చెక్

- పన్నుల రాబడి పెంపుపై సీఎం రేవంత్‌రెడ్డి కీలక కసరత్తు
- వాణిజ్య పన్నులు, ఎక్సైజ్ శాఖల్లో సంస్కరణలకు ప్రణాళిక
- నిర్మాణ రంగంలోని పన్నుల లీకేజీలను అరికట్టేందుకు శాఖల అనుసంధానం
- వ్యాపారులకు ఇబ్బంది లేకుండా సాంకేతికత వినియోగం
- అరవింద్ సుబ్రమణియన్‌తో సీఎం ప్రత్యేక సమావేశం

3

## ఫీజు వివరాలు నోటీసు బోర్డులో పెట్టాల్సిందే

- ప్రైవేట్ పాఠశాలలకు విద్యాశాఖ కీలక ఆదేశాలు
- తరగతుల వారీగా ఫీజుల వివరాలు బహిరంగంగా ప్రదర్శించాలి
- పాఠశాల వెబ్‌సైట్, విద్యాశాఖ పోర్టల్‌లోనూ నమోదు చేయాలి
- ఫీజుల నిర్ణయానికి సంబంధించిన పత్రాలు, పాలకవర్గ తీర్మానాలు సమర్పించాలి

2

## చేనేత సంక్షోభంపై కేటీఆర్ బహిరంగ లేఖ

- నిలిచిపోయిన సంక్షేమ పథకాలు పునరుద్ధరించాలి.. నేతన్నల హామీలు అమలు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి డిమాండ్
- కేసీఆర్ హయాంలో అమలైన 'నేతన్న బీమా', 'నేతన్నకు చేయూత' పథకాలు నిలిచిపోయాయని ఆరోపణ
- కేంద్రం తీసుకున్న నిర్ణయాలు కూడా చేనేత రంగానికి నష్టం చేశాయని వ్యాఖ్య

2



## త్వరలో డిజిటల్ అసెంబ్లీ, డిజిటల్ కౌన్సిల్




2

- పౌరుల డేటా భద్రతకు బ్లాక్‌చెయిన్ ఆధారిత సర్టిఫికెట్ల జారీ
- అన్ని గ్రామీణ ప్రాంతాలకు హై-స్పీడ్ డిజిటల్ కనెక్టివిటీ
- ఏఐ ట్రాన్స్‌ఫర్మేషన్ కాంక్లేవ్‌లో మంత్రి శ్రీధర్‌బాబు

## అధికారులను కోర్టుకు పిలిపించడం బాధగా ఉంది

- ఐఏఎస్ సందీప్ సుల్తానియా కేసు విచారణలో హైకోర్టు కీలక వ్యాఖ్యలు



3




## ములాఖత్‌ల మతలబు ఏమిటో?

- అంతుపట్టని బీజేపీ నేతల వరుస భేటీలు
- బండి సంజయ్ ఇంట్లో ఈటల, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి భేటీ
- ముగ్గురు ఎంపీల కలయికపై పార్టీలో ఆసక్తికర చర్చ
- వరుస సమావేశాల తర్వాతే మూడు జిల్లాల అధ్యక్షుల నియామకం

2




# రాష్ట్ర సుభిక్షం కోసం మహా వరుణ యాగం

**నాగార్జునసాగర్, ఆగస్టు 7, సిరి న్యూస్:**

తెలంగాణలో విస్తారంగా వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో మహా వరుణ యాగం నిర్వహించనున్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, వాతావరణ ప్రతికూలతలు తగ్గి జలాశయాలు నిండాలని సంకల్పిస్తూ నాగార్జునసాగర్ వేదికగా ఈ వైదిక క్రతువుకు శ్రీకారం చుట్టనున్నారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన ప్రధాన అర్చకులు, వేద పండితులు, సిద్ధాంతి శాస్త్రోక్తంగా చర్చించి ఆగస్టు 10ను యాగానికి శుభ ముహూర్తంగా నిర్ణయించారు. నాగార్జునసాగర్ డ్యామ్ సమీపంలోని విజయవిహార్ ప్రాంగణంలో రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో యాగాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

**108 మంది ఋత్వికులతో ప్రత్యేక పూజలు**

యాదగిరిగుట్ట క్షేత్రానికి చెందిన అర్చకులు, వేద పండితులు వేద మంత్రోచ్ఛారణల మధ్య యాగాన్ని నిర్వహించనున్నారు. ఇందుకోసం ప్రాంగణంలో 11 హోమకుండాలను సిద్ధం చేస్తున్నారు. సుమారు 108 మంది ఋత్వికులు, వేద పండితులు క్రతువులో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

కృష్ణా, గోదావరి నదుల్లోకి సమృద్ధిగా వరద నీరు చేరాలని, డ్యామ్‌లు, జలాశయాలు, చెరువులు, కుంటలు నిండాలని యాగంలో సంకల్పించనున్నారు. రాష్ట్ర రైతులకు పాడి పంటలు సమృద్ధిగా పండి ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు చేపట్టనున్నారు.

**ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పర్యవేక్షణలో ఏర్పాట్లు**

రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సారథ్యంలో యాగానికి సంబంధించిన ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ఆగస్టు 10న రోజంతా జరిగే వైదిక కార్యక్రమాలు మధ్యాహ్నం 3.24 గంటలకు పూర్ణాహుతితో ముగియనున్నాయి. పూర్ణాహుతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి జలవనరులు నిండాలని, రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా పంటలు పండాలని ఈ సందర్భంగా యాగం ద్వారా ఆకాంక్షించనున్నారు.

## తాగునీటి విప్లవానికి నిదర్శనం
# మిషన్ భగీరథ

**మొదటిపేజీ తరువాయి**



సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందించారు. మిషన్ భగీరథకు సంబంధించిన ప్రత్యేక వీడియోను పంచుకున్న ఆయన.. ఇది కేవలం ప్రభుత్వ పథకం మాత్రమే కాదని, తెలంగాణ ప్రజల తాగునీటి కష్టాలకు పరిష్కారం చూపిన మహత్తరమైన తాగునీటి విప్లవమని పేర్కొన్నారు.

**దేశానికి ఆదర్శంగా నిలిచిన ప్రాజెక్ట్**

దశాబ్దం క్రితం రూపొందించిన మిషన్ భగీరథ తెలంగాణ ప్రజలు ఎదుర్కొన్న తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిందని హరీశ్‌రావు తెలిపారు. ప్రతి ఇంటికీ నిరంతరాయంగా స్వచ్ఛమైన నల్లా నీరు అందించేలా ఏర్పాటైన ఈ వ్యవస్థ దేశంలోనే అతిపెద్ద తాగునీటి మౌలిక వసతుల ప్రాజెక్టుగా గుర్తింపు పొందిందన్నారు. తెలంగాణను దశాబ్దాలుగా వేధించిన ఫ్లోరోసిస్ సమస్యను నిర్మూలించడంలోనూ మిషన్ భగీరథ కీలక పాత్ర పోషించిందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'హర్ ఘర్ జల్' కార్యక్రమానికి మిషన్ భగీరథ ఆదర్శంగా నిలిచిందని, దేశవ్యాప్తంగా ఈ ప్రాజెక్టుకు ప్రశంసలు లభించాయని హరీశ్‌రావు గుర్తుచేశారు.

**కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు**

మాజీ సీఎం కేసీఆర్ దూరదృష్టి, ఆచరణాత్మక ఆలోచనలకు మిషన్ భగీరథ ప్రత్యక్ష నిదర్శనమని హరీశ్‌రావు పేర్కొన్నారు. అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పథకం నిర్వహణపై నిర్లక్ష్యం చూపుతోందని ఆరోపించారు. గతంలో నిరంతరం నీరు సరఫరా చేసిన నల్లాలు ఇప్పుడు ఎండిపోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

మిషన్ భగీరథను ప్రభుత్వం తక్షణమే సమర్థంగా నిర్వహించి ప్రజలకు నిరంతరాయంగా సురక్షిత తాగునీరు అందించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ప్రజల జీవితాలతో ముడిపడిన ఈ పథకం మౌలిక లక్ష్యం దెబ్బతినకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.

## ఫీజు వివరాలు నోటీసు
# బోర్డులో పెట్టాల్సిందే

**హైదరాబాద్, ఆగస్టు 7, సిరి న్యూస్:**

తెలంగాణలోని ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల వసూళ్లలో పారదర్శకత పెంచేందుకు పాఠశాల విద్యాశాఖ కీలక ఆదేశాలు జారీ చేసింది. 202627 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రతి ప్రైవేట్ పాఠశాల తరగతుల వారీగా వసూలు చేసే ఫీజుల వివరాలను తప్పనిసరిగా బహిరంగపరచాలని స్పష్టం చేసింది. ఇందులో భాగంగా పాఠశాల ప్రాంగణంలోని నోటీసు బోర్డుపై ఫీజుల వివరాలను స్పష్టంగా ప్రదర్శించడంతో పాటు పాఠశాల అధికారిక వెబ్‌సైట్‌లోనూ అందుబాటులో ఉంచాలని ఆదేశించింది.

**విద్యాశాఖ పోర్టల్‌లోనూ నమోదు**

ఫీజుల వివరాలను విద్యాశాఖ అధికారిక పోర్టల్‌లోనూ నమోదు చేయాల్సి ఉంటుంది. ఫీజులను ఏ ప్రాతిపదికన నిర్ణయించారో తెలిపే పత్రాలతో పాటు పాలకవర్గ సభ్యుల సంతకాలతో కూడిన తీర్మాన ప్రతులను కూడా పోర్టల్‌లో దాఖలు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీనివల్ల పాఠశాలలు వసూలు చేస్తున్న ఫీజులపై తల్లిదండ్రులకు స్పష్టత లభించనుంది.

**ఉల్లంఘిస్తే కఠిన చర్యలు**

జీఓ ఎంఎస్ నంబర్ 1 (1994)లోని నిబంధనల ప్రకారం ఫీజుల వివరాలను ప్రదర్శించని పాఠశాలలకు జిల్లా విద్యాధికారులు వెంటనే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని విద్యాశాఖ స్పష్టం చేసింది. నిబంధనలను ఉల్లంఘించిన పాఠశాలలపై అదే జీఓలోని రూల్ 11 ప్రకారం అనుమతులు లేదా గుర్తింపును రద్దు చేసే చర్యలు తీసుకునే అవకాశం ఉందని హెచ్చరించింది. ఈ ఉత్తర్వుల అమలును జిల్లా విద్యాధికారులు, ప్రాంతీయ సంయుక్త డైరెక్టర్లు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించింది. ఫీజుల పేరుతో తల్లిదండ్రులపై అదనపు ఆర్థిక భారం పడకుండా పారదర్శకతను కాపాడాలని విద్యాశాఖ స్పష్టం చేసింది.

# చేనేత సంక్షోభంపై కేటీఆర్ బహిరంగ లేఖ

**హైదరాబాద్, ఆగస్టు 7, సిరి న్యూస్:**



తెలంగాణ సంస్కృతి, అస్తిత్వానికి ప్రతీకగా ఉన్న చేనేత రంగం కాంగ్రెస్ పాలనలో తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆయన బహిరంగ లేఖ రాశారు. గతంలో అమలైన చేనేత సంక్షేమ పథకాలను పునరుద్ధరించడంతో పాటు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

**బీమా, చేయూతతో భరోసా**

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అమలైన 'నేతన్న బీమా', 'నేతన్నకు చేయూత' పథకాలు చేనేత కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించాయని కేటీఆర్ పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 55 వేల మందికిపైగా చేనేత కార్మికులకు రూ.5 లక్షల జీవిత బీమా సౌకర్యం కల్పించామని తెలిపారు. కార్మికుల పొదుపును ప్రోత్సహించేలా ప్రభుత్వం తన వాటాను జమ చేసిన 'నేతన్నకు చేయూత' పథకం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. చేనేత సహకార సంఘాలకు పావలా వడ్డీ రుణాలు, మార్కెటింగ్ రిబేట్లు అందించడంతో పాటు బతుకమ్మ చీరలు, ప్రభుత్వ పాఠశాలల యూనిఫారాల తయారీకి ఆర్డర్లు ఇవ్వడం ద్వారా వేలాది కుటుంబాలకు ఉపాధి కల్పించామని కేటీఆర్ గుర్తుచేశారు.

**కాంగ్రెస్ హామీలపై ప్రశ్నలు**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేనేత సంక్షేమ పథకాలను నిలిపివేసిందని కేటీఆర్ విమర్శించారు. ఎన్నికల సమయంలో చేనేత కార్మికులకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని ఆరోపించారు. చేనేత భరోసా కింద ఏటా రూ.18 వేల ఆర్థిక సాయం, అనుబంధ కార్మికులకు రూ.6 వేల సాయం, వ్యక్తిగత రుణమాఫీ, సహకార సంఘాల రుణమాఫీ, జీఎస్టీ భారాన్ని ప్రభుత్వమే భరిస్తుందన్న హామీలు అమలుకు నోచుకోలేదన్నారు. రెండున్నరేళ్లు గడిచినా నేతన్నల జీవితాల్లో ఆశించిన మార్పు కనిపించడం లేదని కేటీఆర్ పేర్కొన్నారు.

**పథకాలు పునరుద్ధరించాలని డిమాండ్**

నేతన్నల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కేటీఆర్ కోరారు. గతంలో అమలైన చేనేత సంక్షేమ పథకాలన్నింటినీ పునరుద్ధరించి, పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. చేనేత భరోసా, రుణమాఫీ, జీఎస్టీ రీయింబర్స్‌మెంట్ వంటి ఎన్నికల హామీలను అమలు చేసి నేతన్న కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలని కోరారు.

నేతన్నల జీవనోపాధిని కాపాడితేనే చేనేత రంగం, తెలంగాణ సంస్కృతి, ఆత్మగౌరవం నిలుస్తాయని కేటీఆర్ తన లేఖలో పేర్కొన్నారు.


**కేంద్రంపైనా విమర్శలు**

చేనేత రంగంపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా నిర్లక్ష్య వైఖరి అవలంబించిందని కేటీఆర్ ఆరోపించారు. ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ బోర్డు, హ్యాండీక్రాఫ్ట్స్ బోర్డు, పవర్‌లూమ్ బోర్డుల రద్దు, పలు సంక్షేమ పథకాల నిలిపివేత, చేనేత ఉత్పత్తులపై 5 శాతం జీఎస్టీ వంటి నిర్ణయాలు రంగాన్ని దెబ్బతీశాయని అన్నారు. చేనేత విషయంలో కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాల విధానాల్లో పెద్దగా తేడా లేదని విమర్శించారు.

# ములాఖత్‌ల మతలబు ఏమిటో?

**హైదరాబాద్, ఆగస్టు 7, సిరి న్యూస్:**

తెలంగాణ బీజేపీలో కొంతకాలంగా కనిపిస్తున్న అంతర్గత విభేదాలకు భిన్నంగా వరుసగా చోటుచేసుకుంటున్న నేతల భేటీలు ఇప్పుడు పార్టీలో ఆసక్తికర చర్చకు దారితీస్తున్నాయి. కేంద్ర మంత్రి బండి సంజయ్ నివాసంలో ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సమావేశమై ఆత్మీయంగా మాట్లాడుకోవడం, అనంతరం మూడు జిల్లాల పార్టీ అధ్యక్షుల నియామకాలు పూర్తవడం వెనుక అసలు మతలబేంటన్న చర్చ మొదలైంది.



బండి సంజయ్, ఈటల రాజేందర్ మధ్య విభేదాలు ఉన్నాయనే ప్రచారం చాలాకాలంగా పార్టీలో ఉంది. కొండా విశ్వేశ్వర్‌రెడ్డితోనూ కొన్ని అంశాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమైన సందర్భాలు ఉన్నాయి. అలాంటి నేతలు ఒకే ఇంట్లో సమావేశమై కలిసి భోజనం చేయడం పార్టీ శ్రేణులకు కొత్త దృశ్యంగా మారింది.

ఈ భేటీకి ముందే తెలంగాణ బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ అభయ్ పాటిల్ ఢిల్లీలో పలువురు ఎంపీలతో సమావేశమైనట్లు సమాచారం. ఆ తర్వాత బండి సంజయ్ నివాసంలో ఈటల, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి భేటీ కావడం, ఆ వెంటనే నెలలుగా పెండింగ్‌లో ఉన్న మూడు జిల్లాల అధ్యక్ష పదవులను భర్తీ చేయడం వరుస పరిణామాలపై ఆసక్తిని పెంచింది. సమావేశంలో పార్టీ సీనియర్ నేత లక్ష్మణ్ కూడా పాల్గొన్నట్లు సమాచారం.

**మూడు పదవుల వెనుక ఏం జరిగింది?**

తెలంగాణ బీజేపీలో 38 సంస్థాగత జిల్లాలు ఉన్నాయి. ఇప్పటికే 36 జిల్లాల అధ్యక్షుల నియామకాలు పూర్తయ్యాయి. మిగిలిన మూడు జిల్లాల అధ్యక్ష పదవులు మాత్రం నేతల మధ్య ఏకాభిప్రాయం లేకపోవడంతో నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయి.

కరీంనగర్‌లో బండి సంజయ్, మేడ్చల్ అర్బన్‌లో ఈటల రాజేందర్ తమకు అనుకూలమైన వ్యక్తులకు అవకాశం కల్పించాలని పట్టుబట్టినట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరిగింది. దీంతో నియామక ప్రక్రియ ముందుకు సాగలేదు. తాజాగా మూడు జిల్లాలకు అధ్యక్షులను ప్రకటించడంతో ఈ వివాదానికి ముగింపు పలికినట్లయింది. కొత్తగా నియమితులైన వారిలో ఎంపీలు సూచించిన వ్యక్తులకే అవకాశం దక్కిందన్న ప్రచారం కూడా పార్టీలో జరుగుతోంది. దీంతో ఇన్నాళ్లుగా కొనసాగిన పీటముడి ఎలా వీడింది? నేతల మధ్య ఏకాభిప్రాయం కుదిరిందా? లేక ఎవరి పంతం వారికి నెరవేరిందా? అన్నది చర్చనీయాంశంగా మారింది.

**వరుస భేటీల వెనుక సయోధ్యేనా?**

మూడు జిల్లాల అధ్యక్షుల నియామకానికి ముందు చోటుచేసుకున్న కీలక భేటీలు ఇప్పుడు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ముఖ్య నేతల మధ్య దూరాన్ని తగ్గించేందుకు పార్టీ అధిష్టానం నుంచి ఏదైనా ప్రయత్నం జరిగిందా? రాష్ట్రంలో పార్టీని మరింత సమన్వయంతో ముందుకు తీసుకెళ్లేందుకు నేతల మధ్య అవగాహన కుదిరిందా? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

అయితే భేటీల్లో ఏ అంశాలపై చర్చ జరిగిందన్నది మాత్రం అధికారికంగా వెల్లడికాలేదు. రాజకీయంగా ఎలాంటి కొత్త సమీకరణాలు రూపుదిద్దుకుంటున్నాయన్నది కూడా స్పష్టత లేదు. ఇన్నాళ్లూ ఎడముఖం పెడముఖంగా కనిపించిన నేతలు ఒకే చోట కూర్చొని మాట్లాడుకోవడం మాత్రం పార్టీకి సానుకూల పరిణామమేనని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. ఈ కలయిక కేవలం జిల్లాల అధ్యక్షుల నియామకానికే పరిమితమా? లేక రాబోయే రోజుల్లో రాష్ట్ర బీజేపీలో విభేదాలకు చెక్ పెట్టే కొత్త అధ్యాయానికి నాందియా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## అధికారంలోకి రావడమే
# బీజేపీ టార్గెట్

**ఢిల్లీ, ఆగస్టు 7, సిరి న్యూస్:**

వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారంలోకి రావడమే బీజేపీ టార్గెట్ అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. అధికారం చేపట్టే విషయంలో ఎవరితోనూ పొత్తు ఉండదన్నారు. జనసేన సహా ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోబోమని తేల్చి చెప్పారు. అయితే ఎన్డీయే కూటమిలో జనసేన భాగస్వామి అని, దానిపై జాతీయస్థాయిలోనే నిర్ణయం ఉంటుందని స్పష్టం చేశారు. రామచందర్ రావు, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఎంపీలతో జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ఢిల్లీలో శుక్రవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో బీజేపీ బలోపేతంపై కీలకంగా చర్చించారు. నియోజకవర్గాల వారీగా పార్టీ పరిస్థితిని సమీక్షించారు. సంస్థాగత విస్తరణ, భవిష్యత్ కార్యాచరణపైనా చర్చ జరిగింది. అనంతరం రామచందర్ రావు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారం కోసం రోడ్ మ్యాప్ సిద్ధం చేస్తున్నామని, 937 మండలాల్లో పార్టీని బలోపేతం చేస్తున్నామని వెల్లడించారు. వచ్చే ఎన్నికల్లో తమ పార్టీదే గెలుపని, కచ్చితంగా అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. పశ్చిమ బెంగాల్ తరహాలో ఇక్కడా విజయం సాధించి అధికారం చేపడతామన్నారు. రాష్ట్రంలోని కీలక నేతలంతా బీజేపీలో చేరేందుకు సమయం కోసం వేచి చూస్తున్నారని వ్యాఖ్యలు చేశారు. తమ పార్టీ నేతల మధ్య విభేదాలు లేవని, భేదాభిప్రాయాలు మాత్రమే ఉన్నాయని రామచందర్ రావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వంలో అవినీతి పెరిగిపోయిందని, కలిసి పోరాటం చేయాలని నితిన్ నబిన్ దిశానిర్దేశం చేశారన్నారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలతో మరోసారి సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. ఇకపై ప్రతి మూడు నెలలకు ఒకసారి నితిన్ నబిన్ రాష్ట్రానికి వస్తారని, ఇక్కడి నేతలతో సమావేశమై దిశానిర్దేశం చేస్తారని చెప్పారు. ప్రజా సమస్యల విషయంలో రాష్ట్ర ప్రభుత్వంపై పోరాడతామన్నారు. ఈ సమావేశంలో సునీల్ బన్సల్, అభయ్ పాటిల్ వంటి నేతలు కూడా పాల్గొన్నారు.

# త్వరలో డిజిటల్ అసెంబ్లీ, డిజిటల్ కౌన్సిల్

**హైదరాబాద్, ఆగస్టు 7, సిరి న్యూస్ :**

రాష్ట్రంలో త్వరలోనే డిజిటల్ అసెంబ్లీ, డిజిటల్ కౌన్సిల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రణాళికాబద్ధంగా కృషిచేస్తున్నామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. గవ్ కనెక్ట్(GOVconnect), ఎలక్ట్రానిక్ సర్వీసెస్ డెలివరీ(మీసేవ) సంయుక్త ఆధ్వర్యంలో బేగంపేటలో శుక్రవారం నిర్వహించిన ఏఐ ట్రాన్స్‌ఫర్మేషన్ కాంక్లేవ్ (తెలంగాణ)ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రభుత్వ పాలనలోనూ మార్పులు రావాల్సిన అవసరం ఉందని, ఆ దిశగా తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని అన్నారు. పౌర సేవల్ని మరింత సమర్థవంతంగా ప్రజల ముంగిటకే చేర్చేలా ఏఐ, బ్లాక్ చెయిన్ టెక్నాలజీ, డేటా అనలిటిక్స్, క్వాంటం కంప్యూటింగ్ వంటి ఎమర్జింగ్ టెక్నాలజీలకు పాలనలో పెద్ద పీట వేస్తున్నామన్నారు. డిజిటల్ కేబినెట్, 20 ప్రభుత్వ శాఖలను ఒకే తాటిపైకి తెచ్చేలా రియల్ టైమ్ గవర్నమెంట్ డ్యాష్‌బోర్డు, దేశంలోనే తొలి ఏఐ ఆధారిత డేటా ఎక్స్ఛేంజ్, వాట్సాప్ ద్వారా పౌర సేవల డెలివరీ, మీ టికెట్ వంటి ఎన్నో విప్లవాత్మక సంస్కరణల ద్వారా డిజిటల్ గవర్నెన్స్‌లో తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలిపామన్నారు. పౌరుల డేటా భద్రతకు పెద్ద పీట వేసేలా త్వరలోనే బ్లాక్‌చెయిన్ ఆధారిత సర్టిఫికెట్ల జారీకి శ్రీకారం చుడతామన్నారు. రాష్ట్రంలోని అన్ని గ్రామీణ ప్రాంతాలకు టీ ఫైబర్ ద్వారా హైస్పీడ్ డిజిటల్ కనెక్టివిటీని అందించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామన్నారు. వృద్ధులు, దివ్యాంగులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ప్రభుత్వ పౌర సేవలను నేరుగా వారి ఇంటి ముంగిటకే అందించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. డిజిటల్ ఆఫీస్ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోనూ పూర్తిస్థాయిలో పేపర్‌లెస్ అడ్మినిస్ట్రేషన్ అమలుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో మహారాష్ట్ర సీఎంవో చీఫ్ ఎకనామిక్ అడ్వైజర్, మిత్రా సీఈవో ప్రవీణ్ పరదేశి, సెంటర్ ఫర్ రైల్వే ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ ఎండీ జీవీఎల్ సత్య కుమార్, నేషనల్ ఇంటర్నెట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా సీఈవో డా. దేవేష్ త్యాగి, డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ఫర్ అడిషనల్ సెక్రటరీ సౌరభ్ కె.తివారీ తదితరులు పాల్గొన్నారు.




# నీటిపారుదల సలహా మండళ్ల పునరుద్ధరణ

**హైదరాబాద్, ఆగస్టు 7, సిరి న్యూస్:**

ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రైతుల ప్రయోజనాల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ జిల్లా నీటిపారుదల సలహా మండళ్లను తక్షణమే పునరుద్ధరించాలని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. కలెక్టర్లతో శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, అటవీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఉన్నతాధికారులతో కలిసి ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నీటిపారుదల, వ్యవసాయ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ఇతర సంబంధిత వర్గాలతో కూడిన జిల్లా నీటిపారుదల సలహా మండళ్లు ప్రతి పంట కాలానికి ముందు, పంట సీజన్‌లో తప్పనిసరిగా సమావేశమై జలాశయాల నీటి నిల్వలు, ఆశించదగిన నీటి ప్రవాహాలు, స్థానిక వర్షపాతం, తాగునీటి అవసరాలు, కమాండ్ ఏరియాల్లోని సాగు పరిస్థితులను సమగ్రంగా సమీక్షించి రైతులకు శాస్త్రీయమైన, విశ్వసనీయమైన మార్గదర్శకాలు ఇవ్వాలని ఆదేశించారు. ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వీలైన జిల్లాల్లో రేపటి నుంచే నీటిపారుదల సలహా మండళ్ల సమావేశాలు నిర్వహించాలని కలెక్టర్లను ఆదేశించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ మండళ్లు కేవలం నీటి విడుదలలపై నిర్ణయాలు తీసుకునే వేదికలు మాత్రమే కాకుండా రైతులు ఏ పంట వేస్తే భవిష్యత్తులో నష్టపోకుండా ఉంటారో ముందుగానే తెలియజేసే బాధ్యతాయుతమైన వ్యవస్థగా పనిచేయాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఉన్న జలాశయాల నీటి నిల్వలు, రుతుపవనాల మిగిలిన కాలంలో వర్షపాతం అంచనాలను పరిశీలిస్తే అత్యంత జాగ్రత్తతో పంటల ప్రణాళిక రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాజెక్టుల కింద రైతులు వరి వంటి అధిక నీటి అవసరమున్న పంటలను సాగు చేయవద్దని ఆయన స్పష్టంగా హెచ్చరించారు. ఆగస్టు తొలి వారంలో కురిసిన వర్షాలతో కొంత ఉపశమనం లభించినప్పటికీ, ఆ వర్షాలను ఆధారంగా చేసుకుని రైతులు వరి సాగుకు వెళ్లడం సముచితం కాదన్నారు. ఒకసారి తడిపే అవకాశం లభించినా, రెండోసారి నీరు అందించే పరిస్థితి అనిశ్చితంగా మారే అవకాశం ఉందని, ప్రస్తుతం ప్రోత్సహించి రైతులను పంట వేయించి రెండుమూడు నెలల తర్వాత ఇబ్బందులకు గురిచేయడం ప్రభుత్వ ఉద్దేశం కాదని స్పష్టం చేశారు. ప్రతి కమాండ్ ఏరియాలో ఎంతమేర సాగునీరు అందించగలమో, ఎక్కడ పరిమితులు ఉన్నాయో కలెక్టర్లు, నీటిపారుదల ఇంజినీర్లు, వ్యవసాయ అధికారులు రైతులకు అధికారికంగా తెలియజేయాలని సూచించారు. ప్రధాన జలాశయాల పరిస్థితిపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్లకు మంత్రి ఉత్తమ్ సూచించారు. ముఖ్యంగా నాగార్జునసాగర్, శ్రీరాంసాగర్ ప్రాజెక్టుల్లో నీటి మట్టాలు ఇంకా ఆశించిన స్థాయికి చేరుకోలేదంటూ ఆయా కమాండ్ ఏరియాల్లో నేల స్వభావం, నీటి లభ్యత, వ్యవసాయ శాఖ సిఫార్సులను పరిగణనలోకి తీసుకుని తక్కువ నీటి అవసరమున్న ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని ఆయన ఆదేశించారు. వచ్చే వేసవిలో రాష్ట్రంలో ఎలాంటి తాగునీటి సంక్షోభం తలెత్తకుండా ఇప్పటి నుంచే అవసరమైన నీటి నిల్వలను పరిరక్షించాలని గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. స్థానిక లేదా రాజకీయ ఒత్తిళ్లకు లోనై విచక్షణారహితంగా నీటిని విడుదల చేయరాదని హెచ్చరిస్తూ గ్రామీణ నీటి సరఫరా శాఖ ఇంజినీర్‌ఇన్‌చీఫ్, నీటిపారుదల శాఖ ఇంజినీర్‌ఇన్‌చీఫ్(జనరల్) ఓ.వి. రమేష్ బాబుతో సమన్వయం చేసుకుని భవిష్యత్తు తాగునీటి అవసరాలకు తప్పనిసరిగా ఎంత నీటిని నిల్వ ఉంచాలనే అంశాన్ని నిర్ణయించాలని ఆదేశించారు.

# జీఎస్టీ ఎగవేతకు ఏఐతో చెక్

**హైదరాబాద్, ఆగస్టు 7, సిరి న్యూస్:**

రాష్ట్ర ఆదాయాన్ని పెంచడంతో పాటు పన్నుల ఎగవేతకు అడ్డుకట్ట వేసేందుకు తెలంగాణ ప్రభుత్వం సాంకేతికతను విస్తృతంగా వినియోగించనుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో ప్రముఖ ఆర్థికవేత్త అరవింద్ సుబ్రమణియన్‌తో సమావేశమై వాణిజ్య పన్నులు, ఎక్సైజ్ శాఖల్లో చేపట్టాల్సిన సంస్కరణలపై చర్చించారు. జీఎస్టీ రాబడులను పెంచడం, పన్నుల లీకేజీలను గుర్తించడం కోసం కృత్రిమ మేధ ఆధారిత వ్యవస్థలను అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించారు.

**నిర్మాణ రంగంపై ప్రత్యేక దృష్టి**

భవన నిర్మాణ రంగంలో పన్నుల ఎగవేతకు అవకాశం లేకుండా వివిధ ప్రభుత్వ శాఖలను అనుసంధానం చేయాలని సమావేశంలో నిర్ణయించినట్లు తెలిసింది. మున్సిపల్, రేరా, పంచాయతీరాజ్, విద్యుత్, వాణిజ్య పన్నుల శాఖల సమాచారాన్ని కృత్రిమ మేధ ఆధారిత వ్యవస్థ ద్వారా సమన్వయం చేయనున్నారు. భారీ భవనాలు, కాంట్రాక్టు పనులకు అనుమతులు ఇచ్చే దశలోనే నిర్మాణ సామాగ్రి అవసరాలు, వాటికి సంబంధించిన పన్నుల అంచనాలను నమోదు చేసేలా వ్యవస్థను రూపొందించనున్నారు.

**వ్యాపారులకు ఇబ్బంది లేకుండా..**

పన్నుల వసూళ్లు పెంచే క్రమంలో వ్యాపారులను అనవసరంగా ఇబ్బంది పెట్టకూడదని సీఎం స్పష్టం చేశారు. సులభతర వాణిజ్యానికి ప్రాధాన్యం ఇస్తూనే పన్నుల విధానాన్ని సరళీకరించాలని సూచించారు. అధికారులకు అవసరమైన సమాచారాన్ని కృత్రిమ మేధ ద్వారా వేగంగా అందుబాటులోకి తీసుకురావడం ద్వారా తనిఖీలు, పన్నుల వసూళ్లను మరింత సమర్థంగా నిర్వహించవచ్చని అరవింద్ సుబ్రమణియన్ వివరించారు.

**ప్రభుత్వ సేవల సమాచారాన్ని ఒకే చోటకు..**

పన్నులకు సంబంధించిన సమాచారంతో పాటు మీ సేవ, ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి వంటి పథకాల వివరాలను కూడా సమగ్ర సమాచార వ్యవస్థలోకి తీసుకురావాలని సీఎం సూచించారు. దీనివల్ల ప్రభుత్వ పథకాల అమలు, పర్యవేక్షణలో పారదర్శకత పెరగడంతో పాటు నిర్ణయాలు తీసుకోవడం సులభమవుతుందని పేర్కొన్నారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఎం సలహాదారు కె. రామకృష్ణారావు, ఎక్సైజ్ కార్యదర్శి రఘునందన్‌రావు తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# అధికారులను కోర్టుకు పిలిపించడం బాధగా ఉంది

**హైదరాబాద్, ఆగస్టు 7, సిరి న్యూస్:**

కోర్టు ధిక్కరణ వ్యవహారంలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా హైకోర్టు ముందు వ్యక్తిగతంగా విచారణకు హాజరయ్యారు. కేసు విచారణ సందర్భంగా హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సందీప్ సుల్తానియాపై వెయ్యి కేసులు ఉన్నాయని, అవన్నీ విచారణ చేస్తే జీవిత కాలం జైల్లో ఉండాలని పేర్కొంది. ప్రభుత్వాలు చేసిన తప్పు వల్ల అధికారులకు ఈ పరిస్థితి వచ్చిందన్నారు. అధికారులను హైకోర్టుకు పిలిపించడం బాధగా ఉందని, తప్పని పరిస్థితుల్లో హాజరుకావాలని ఆదేశిస్తున్నామని న్యాయస్థానం తెలిపింది. ఉచిత పథకాల వల్ల చాలా ప్రమాదం ఉందని, రైతుబంధు అనేది సంపన్నులు, అధికారులు కూడా తీసుకుంటున్నారని, ఇది చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేసింది. రైతుబంధుతో రాష్ట్ర ఖజానాకు భారమని హైకోర్టు వ్యాఖ్యానించింది

# 15న 1.06 కోట్ల స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

- సీఎం రేవంత్ చేతుల మీదుగా ప్రారంభం
- మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 7, సిరి న్యూస్ :**

రాష్ట్రవ్యాప్తంగా 1.06 కోట్ల కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్వాతంత్ర్య దినోత్సవం నాడు సంగారెడ్డిలో లాంఛనంగా ప్రారంభించనున్నట్లు నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని 3.42 కోట్ల మంది అర్హులైన లబ్ధిదారులు ప్రయోజనం పొందనున్నారన్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థ(పీడీఎస్) ద్వారా ప్రతి అర్హుడికి ప్రతి నెల 6 కిలోల నాణ్యమైన సన్నబియ్యాన్ని ఉచితంగా ప్రభుత్వం అందించనుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం అమలుకు ప్రతి నెలా సుమారు 2.16 లక్షల మెట్రిక్ టన్నుల సన్న బియ్యాన్ని ప్రభుత్వం పంపిణీ చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. జిల్లా కలెక్టర్లతో శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ కార్యక్రమాన్ని సంగారెడ్డిలో ముఖ్యమంత్రి ప్రారంభించడంతోపాటు రాష్ట్రంలోని మిగిలిన 32 జిల్లాల్లోనూ అదే రోజు ఏకకాలంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాలు ప్రారంభం కావాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఆహార భద్రతను మరింత బలోపేతం చేయడంలో ఈ కార్యక్రమం ఒక చరిత్రాత్మక మైలురాయిగా నిలుస్తుందన్నారు. ప్రతి అర్హులైన కుటుంబానికి గౌరవప్రదమైన జీవనానికి అవసరమైన ఆహార భద్రతను కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. దేశంలో అత్యంత సమర్థవంతమైన ఆహార భద్రతా కార్యక్రమాల్లో ఒకటైన ఈ మహత్తర కార్యక్రమంలో చిన్న పాత్ర పోషించడం ఆనందదాయకంగా ఉందన్నారు.

# నా భర్తను చంపేస్తావా.. నన్ను చావమంటావా?!

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:**

'ఎలాగైనా నా భర్తను చంపు.. లేకపోతే నేనే చనిపోతాను' అంటూ ఒక భార్య తన ప్రియుడికి వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్‌లలో పంపిన సందేశాలు సమాజంలో వివాహేతర సంబంధాలు ఎంతటి దారుణాలకైనా దారితీస్తాయని చాటిచెప్పాయి. మహబూబాబాద్ జిల్లాలో వెలుగుచూసిన ఈ ఘోరం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. తన అక్రమ సంబంధానికి అడ్డుగా నిలుస్తున్నాడని భర్తను అంతమొందించాలని సదరు మహిళ ప్రియుడిని ఉసిగొల్పడం, లేదంటే తాను చనిపోతానని బెదిరించడం డోర్నకల్లు మండలం చిలుకోడు గ్రామంలో చర్చనీయాంశంగా మారింది.

**కొరియర్ బాయ్‌తో పరిచయం..**

పోలీసుల కథనం ప్రకారం.. సూర్యాపేట జిల్లాకు చెందిన భవాని అనే మహిళకు, మహబూబాబాద్ జిల్లా చిలుకోడు గ్రామానికి చెందిన గాదే రాజేశ్వరరావుతో 2016లో వివాహమైంది. వీరికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. అయితే కొంతకాలంగా భవాని.. సైదులు అనే కొరియర్ బాయ్‌తో వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఈ విషయం కాస్తా గత నెల 27న భర్త రాజేశ్వరరావుకు తెలిసింది. భార్య ప్రవర్తనపై అనుమానం వచ్చిన ఆయన వెంటనే ఇరువైపుల పెద్దల సమక్షంలో పంచాయితీ కూడా పెట్టించారు.



**భర్తపై హత్యాయత్నం.. చాటింగ్‌తో గుట్టురట్టు**

పెద్దల పంచాయితీ ముగిసిన తర్వాత, రాజేశ్వరరావు తన అన్నను తీసుకురావడానికి బయటకు వెళ్తుండగా ప్రియుడు సైదులు అతడిని హత్య చేసేందుకు వెంబడించాడు. సైదులు ప్రవర్తనపై తీవ్ర అనుమానం వచ్చిన రాజేశ్వరరావు, చాకచక్యంగా అతడి నుంచి తప్పించుకుని వెంటనే ఇంటికి తిరిగి వచ్చారు. భార్య భవాని మొబైల్ ఫోన్ తీసుకుని ఆమె వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలను తనిఖీ చేశారు. అందులో భవాని తన ప్రియుడు సైదులుకు పంపిన మెసేజీలు చూసి ఆయన ఒక్కసారిగా ఖంగుతిన్నారు. 'ఎలాగైనా నా భర్తను చంపేయ్.. లేదంటే నేనే చనిపోతాను' అంటూ ఆమె స్పష్టంగా సందేశాలు పంపినట్లు నిరూపించే ఆధారాలు లభించాయి.

**పోలీసులకు ఫిర్యాదు..**

ప్రియుడితో కలిసి తననే ప్రాణాలతో తీసేందుకు కుట్ర పన్నినట్లు గ్రహించిన రాజేశ్వరరావు.. ఆ చాటింగ్ స్క్రీన్‌షాట్లను సాక్ష్యాలుగా తీసుకుని వెంటనే డోర్నకల్లు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే, మొదట పోలీసులు కేసు నమోదులో జాప్యం చేయడంతో బాధితుడు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈ క్రమంలో ఆయన మరోసారి రూరల్ సీఐని స్వయంగా కలిసి తనకు, తన పిల్లలకు రక్షణ కల్పించి న్యాయం చేయాలని వేడుకున్నారు. స్పందించిన రూరల్ సీఐ.. వెంటనే కేసు నమోదు చేసి చట్టపరమైన దర్యాప్తు జరుపుతామని, బాధితుడికి పూర్తిస్థాయి రక్షణ కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ ఉదంతం ప్రస్తుతం ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల్లో తీవ్ర సంచలనంగా మారింది.

# భర్తను హత్య చేయించేందుకు భార్య కుట్ర!

- ప్రియుడితో కలిసి రోడ్డు ప్రమాదం సృష్టించాలని పథకం..
- చాటింగ్ ఆధారంగా పోలీసులకు ఫిర్యాదు

**మహబూబాబాద్, ఆగస్టు 7, సిరి న్యూస్:**

దాంపత్య బంధాన్ని మరిచి ఓ మహిళ తన ప్రియుడితో కలిసి భర్తను హత్య చేయించేందుకు కుట్ర పన్నినట్లు ఆరోపణలు రావడం మహబూబాబాద్ జిల్లా డోర్నకల్లు మండలంలో కలకలం రేపింది. రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించి భర్తను హతమార్చాలని ప్రియుడితో ఆమె చేసిన చాటింగ్ వెలుగులోకి వచ్చినట్లు బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. తన ప్రాణాలకు ముప్పు ఉందంటూ భార్యతో పాటు ఆమె ప్రియుడు పురిమెట్ల సైదులుపై చర్యలు తీసుకోవాలని కోరాడు.

**చాటింగ్‌లో వెలుగులోకి వచ్చిన కుట్ర**

డోర్నకల్లు మండలం చిలుకోడు గ్రామానికి చెందిన గాదే రాజేశ్వరరావు ప్రస్తుతం ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని సాయిప్రభాత్ నగర్‌లో నివసిస్తూ ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో పనిచేస్తున్నాడు. 2016లో సూర్యాపేట జిల్లా మోతె మండలానికి చెందిన యువతిని వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

జూలై 27న భోజనం చేసేందుకు ఇంటికి వెళ్లిన సమయంలో తన భార్య మరో వ్యక్తితో సన్నిహితంగా ఉండటాన్ని గుర్తించినట్లు రాజేశ్వరరావు ఫిర్యాదులో తెలిపాడు. ఈ విషయంపై కుటుంబ పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించాలని నిర్ణయించుకున్నట్లు పేర్కొన్నాడు. మరుసటి రోజు తన అన్నను తీసుకురావడానికి వెళ్లిన సమయంలో ఓ వ్యక్తి తనను వెంబడించినట్లు అనుమానం వ్యక్తం చేశాడు. అనంతరం భార్య ఫోన్‌ను పరిశీలించగా ప్రియుడితో ఆమె జరిపిన సంభాషణలు బయటపడినట్లు తెలిపాడు. తనను ఎలాగైనా హత్య చేయించాలని ఆమె ప్రియుడితో చాటింగ్ చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. రోడ్డు ప్రమాదం జరిగేలా చేసి తనను అంతమొందించాలని ఆమె ఒత్తిడి చేసినట్లు చాటింగ్‌లో ఉన్నట్లు ఆరోపించాడు.

**జీరో ఎఫ్ఐఆర్ నమోదు**

తన ప్రాణాలకు ముప్పు ఉందని పేర్కొంటూ రాజేశ్వరరావు డోర్నకల్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు ఆధారంగా పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేసును ఖమ్మం గ్రామీణ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. అనంతరం బాధితుడు ఖమ్మం గ్రామీణ పోలీసులకు కూడా ఫిర్యాదు చేశాడు. కేసులో సమర్పించిన మొబైల్ చాటింగ్, ఇతర డిజిటల్ ఆధారాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. ఆరోపణలపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టి, ఆధారాల ఆధారంగా తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

# ఓసీ.. ఏది ఒరిజినల్?!

**మొదటిపేజీ తరువాయి**

అక్రమానికి ప్రధాన కారణమని స్పష్టమవుతోంది.

**అన్ని శాఖల పోర్టల్ల అనుసంధానమే ఏకైక పరిష్కారం**

ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ మంజూరు విషయంలో మున్సిపల్ శాఖకు కేవలం పరిమిత శాఖలతోనే సాంకేతిక సమన్వయం ఉంది. మిగతా శాఖల వద్దకు వెళ్లే ఓసీలు కేవలం కాగితపు ధ్రువపత్రాలుగా మాత్రమే వాడబడుతున్నాయి. దీన్ని ఆసరాగా చేసుకునే అక్రమార్కులు ఫోర్జరీ సంతకాలతో నకిలీ ఓసీలను తయారు చేసి అనుమతులు పొందుతున్నారు. ఇప్పటికైనా గ్రేటర్‌లోని మూడు మున్సిపాలిటీల్లో ఓసీలను ఉపయోగించే అన్ని ప్రభుత్వ శాఖలను మరియు విద్యా బోర్డులను మున్సిపల్ పోర్టల్ విజిబిలిటీతో అనుసంధానం చేయాల్సిన అత్యవసర పరిస్థితి ఏర్పడింది. ఓసీ జారీ చేసేటప్పుడు ధ్రువీకరించే అధికారుల డిజిటల్ సైన్ పోర్టల్‌లో ఉంటుంది కాబట్టి, సదరు ఓసీ ఏ ఏ శాఖల్లో వాడబడుతుందో ఆ శాఖల అధికారులు కూడా ఆన్‌లైన్‌లో సరిచూసుకునే వెసులుబాటు ఉంటే ఇలాంటి ఫోర్జరీ రకెట్లకు శాశ్వతంగా చెక్ పెట్టవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

# చేనేతకు ఆధునిక సాంకేతికత.. నేతన్నలకు మరింత అండ

- 2030 నాటికి వస్త్ర ఎగుమతులను రూ.9 లక్షల కోట్లకు పెంచే లక్ష్యం
- జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రకటన
- వరంగల్‌లో పీఎం మిత్ర మెగా టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు
- పీఎల్ఐ, ముద్ర రుణాలు, ముడిసరుకు పథకాలతో నేత కార్మికులకు ప్రోత్సాహం
- చేనేతలో ఏఐ, ఆటోమేషన్ వినియోగంతో ఉత్పాదకత పెంపు



**హైదరాబాద్, ఆగస్టు 7, సిరి న్యూస్:**

చేనేత, వస్త్ర పరిశ్రమను మరింత బలోపేతం చేసి భారతదేశాన్ని ప్రపంచ వస్త్ర కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నేత కార్మికులకు శుభాకాంక్షలు తెలిపిన ఆయన.. వ్యవసాయం తర్వాత దేశంలో అత్యధిక మందికి ఉపాధి కల్పిస్తున్న రంగాల్లో చేనేత, వస్త్ర పరిశ్రమ కీలకమైనదని పేర్కొన్నారు. ఈ రంగం ద్వారా దాదాపు ఐదు కోట్ల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తోందని తెలిపారు.

**2030 నాటికి రూ.9 లక్షల కోట్ల ఎగుమతులు**

ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో 'మేక్ ఇన్ ఇండియా'తో పాటు 5ఎఫ్ విధానాన్ని అమలు చేస్తున్నట్లు కిషన్‌రెడ్డి వివరించారు. పొలం నుంచి నార, నార నుంచి వస్త్రం, వస్త్రం నుంచి ఫ్యాషన్, ఫ్యాషన్ నుంచి విదేశీ మార్కెట్ల వరకు సమగ్ర అభివృద్ధి సాధించడమే ఈ విధానం లక్ష్యమన్నారు. 2030 నాటికి వస్త్ర ఎగుమతులను రూ.9 లక్షల కోట్లకు పెంచాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు.

**నేతన్నలకు పథకాలతో ప్రోత్సాహం**

ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం, పీఎం మిత్ర పార్కులు, జాతీయ చేనేత అభివృద్ధి కార్యక్రమం, ముడిసరుకు సరఫరా పథకం, వీవర్స్ ముద్రా పథకం ద్వారా నేత కార్మికులకు ఆధునిక మగ్గాలు, ముడిసరుకు, రుణాలు, మార్కెటింగ్ సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. సామాజిక భద్రతను కూడా బలోపేతం చేస్తున్నామని పేర్కొన్నారు.

**వరంగల్‌లో పీఎం మిత్ర పార్క్**

తెలంగాణలోని వరంగల్‌లో పీఎం మిత్ర మెగా టెక్స్‌టైల్ పార్క్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు కిషన్‌రెడ్డి తెలిపారు. పత్తి రైతులకు మద్దతు ధర కల్పించే చర్యల్లో భాగంగా కేంద్రం ఇప్పటివరకు రూ.69,860 కోట్లకు పైగా ఖర్చు చేసిందన్నారు. రైతుల నుంచి ముడిసరుకు సేకరణ నుంచి వస్త్ర తయారీ, ఎగుమతుల వరకు మొత్తం వ్యవస్థను బలోపేతం చేస్తున్నట్లు చెప్పారు. చేనేత రంగంలో కృత్రిమ మేధ, ఆటోమేషన్ వంటి ఆధునిక సాంకేతికతను వినియోగించడం ద్వారా ఉత్పాదకత, నాణ్యతను పెంచుతున్నామని కిషన్‌రెడ్డి తెలిపారు. సంప్రదాయ చేనేత కళను కాపాడుతూ నేతన్నలకు అండగా నిలవడానికి కేంద్రం కట్టుబడి ఉందన్నారు. దేశ ప్రజలు చేనేత వస్త్రాలను ఎక్కువగా వినియోగించి నేత కార్మికులను ప్రోత్సహించాలని ఆయన కోరారు.

# సంక్షోభాలను అవకాశాలుగా మలచుకోవాలి

**హైదరాబాద్, ఆగస్టు 7, సిరి న్యూస్:**

ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక, భౌగోళిక రాజకీయ అనిశ్చితులను సవాళ్లుగా కాకుండా కొత్త అవకాశాలుగా మలచుకోవాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. సంక్షోభ సమయాల్లో కొత్త సాంకేతికత, నాణ్యత, ఆవిష్కరణలపై పెట్టుబడులు పెట్టే పరిశ్రమలే భవిష్యత్తులో మార్కెట్‌ను శాసిస్తాయన్నారు. పరిశ్రమల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో హిప్లెక్స్2026 (Hyderabad International Plastics Expo2026) ప్లాస్టిక్స్, పాలిమర్స్, ప్రాసెసింగ్ టెక్నాలజీ, యంత్రాల అంతర్జాతీయ ప్రదర్శనను మంత్రి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమల ప్రదర్శనల్లో తనకు యంత్రాలు మాత్రమే కనిపించవని, వాటి వెనుక వేలాది కుటుంబాల జీవనోపాధి, దేశాభివృద్ధికి కృషి చేస్తున్న పారిశ్రామికవేత్తల సంకల్పం, యువత భవిష్యత్తు కనిపిస్తాయని అన్నారు. ఎన్ని ప్రతికూల పరిస్థితులు ఎదురైనా పెట్టుబడులు, విస్తరణ, ఆవిష్కరణలను కొనసాగిస్తున్న పరిశ్రమల ఆత్మవిశ్వాసమే భారతదేశ బలమని చెప్పారు.




**పాలిమర్ రంగం దేశ తయారీ రంగానికి వెన్నెముక**

ప్లాస్టిక్స్, పాలిమర్ పరిశ్రమ దేశ తయారీ రంగంలో అత్యంత కీలకమైందని మంత్రి తెలిపారు. గృహ నిర్మాణం, తాగునీటి సరఫరా, వ్యవసాయం, వైద్యరంగం, ఔషధ తయారీ, ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్, ఆహార ప్రాసెసింగ్, మౌలిక సదుపాయాల రంగాలకు అవసరమైన ముడి పదార్థాలను ఈ రంగమే అందిస్తోందన్నారు. దేశవ్యాప్తంగా ఈ పరిశ్రమ ద్వారా 50 లక్షల మందికి ప్రత్యక్షంగా, కోటి మందికి పైగా పరోక్షంగా ఉపాధి లభిస్తోందని, తెలంగాణలోనే ఈ రంగంపై సుమారు రెండు లక్షల మంది జీవనోపాధి ఆధారపడి ఉందని వివరించారు. పాలిమర్ రంగం అభివృద్ధి చెందితే తయారీ రంగం విస్తరిస్తుందని, దాంతో ఉపాధి అవకాశాలు పెరిగి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని చెప్పారు.

**మందగమనం తాత్కాలికమే.. పరిశ్రమల ధైర్యం శాశ్వతం**

గత ఆర్థిక సంవత్సరంలో పశ్చిమాసియా ఉద్రిక్తతలు, ముడి చమురు ధరల పెరుగుదల, పాలిమర్ ధరల అస్థిరత, రవాణా, విద్యుత్ వ్యయాల పెరుగుదల, కార్మికుల కొరత వంటి అంశాలు పరిశ్రమపై ప్రతికూల ప్రభావం చూపాయని మంత్రి పేర్కొన్నారు. దేశ జీడీపీ వృద్ధికి సమాంతరంగా అభివృద్ధి చెందే పాలిమర్ రంగం గత ఏడాది కేవలం 2.4 శాతం వృద్ధిని మాత్రమే నమోదు చేసిందన్నారు. పీవీసీ పైపులు, హెచ్‌డీపీఈ పైపులు, ఆటోమొబైల్ రంగాలకు సంబంధించిన ఉత్పత్తుల్లో మందగమనం కనిపించినప్పటికీ పరిశ్రమల్లో విశ్వాసం ఏమాత్రం తగ్గలేదని అన్నారు. హిప్లెక్స్2026కు లభించిన విశేష స్పందనే దేశ పారిశ్రామిక రంగం భవిష్యత్తుపై ఉన్న నమ్మకానికి నిదర్శనమని పేర్కొన్నారు. చరిత్ర చెబుతున్నదేమిటంటే సంక్షోభ సమయాల్లోనే గొప్ప పరిశ్రమలు ఆవిర్భవిస్తాయని వ్యాఖ్యానించారు.

**సమగ్ర ప్రతిపాదనలు ఇస్తే పరిశీలిస్తాం**

పరిశ్రమలతో కలిసి పనిచేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని శ్రీధర్‌బాబు తెలిపారు. ఏఐపీఎంఏ, టాప్మా, ఐపీఐ వంటి పరిశ్రమల సంఘాలు విధానపరమైన అంశాలు, మౌలిక సదుపాయాల అవసరాలు, ఎదుర్కొంటున్న సమస్యలపై సమగ్ర ప్రతిపాదనలు అందిస్తే ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి విధానపరమైన సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. పరిశ్రమలతో నిరంతర సంప్రదింపులే తమ ప్రభుత్వ విధానమని స్పష్టం చేశారు.

**పాలిమర్ రంగంలోనూ తెలంగాణకు అగ్రస్థానం**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ దేశంలోనే పెట్టుబడులకు అత్యంత అనుకూల రాష్ట్రంగా ఎదిగిందని మంత్రి పేర్కొన్నారు. ఐటీ, ఎలక్ట్రానిక్స్, లైఫ్ సైన్సెస్, ఫార్మా, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు, రక్షణ, ఏరోస్పేస్ రంగాల్లో సాధించిన విజయాలను పాలిమర్ రంగంలోనూ పునరావృతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్లాస్టిక్ ప్రాసెసింగ్, ఇంజినీరింగ్ ప్లాస్టిక్స్, మెడికల్ ప్లాస్టిక్స్, ప్యాకేజింగ్ టెక్నాలజీలు, పాలిమర్ కాంపౌండింగ్, రీసైక్లింగ్, సర్క్యులర్ ఎకానమీ, ఈవీ విడిభాగాలు, ఎలక్ట్రానిక్స్ తయారీ, బయో ఆధారిత పాలిమర్ల రంగాల్లో తెలంగాణకు అపార అవకాశాలు ఉన్నాయని తెలిపారు.

**2030 నాటికి 20 లక్షల టన్నుల వినియోగ లక్ష్యం**

ప్రస్తుతం తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లో కలిపి సుమారు 13 లక్షల టన్నుల పాలిమర్ వినియోగం ఉందని, ప్రభుత్వంపరిశ్రమలు సమన్వయంతో పనిచేస్తే 2030 నాటికి ఇది 20 లక్షల టన్నులకుపైగా చేరుతుందని మంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు. మౌలిక వసతులు, నైపుణ్య మానవ వనరులు, పారిశ్రామిక వాతావరణం తెలంగాణలో ఉన్నందున దేశంలోనే ప్రముఖ పాలిమర్ తయారీ, ప్రాసెసింగ్ కేంద్రంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దడం సాధ్యమవుతుందని అన్నారు. పర్యావరణ పరిరక్షణ, పారిశ్రామిక అభివృద్ధి రెండూ సమాంతరంగా సాగాలని పేర్కొంటూ గ్రీన్ మాన్యుఫ్యాక్చరింగ్, రీసైక్లింగ్, సర్క్యులర్ ఎకానమీ విధానాలను అనుసరించే పరిశ్రమలకు ప్రభుత్వం మరింత ప్రోత్సాహం అందిస్తుందని తెలిపారు. పెట్టుబడులు కొనసాగిస్తూ ఉపాధి అవకాశాలను సృష్టించాలని, ప్రతి అడుగులోనూ ప్రభుత్వం పరిశ్రమలకు అండగా నిలుస్తుందని మంత్రి స్పష్టం చేశారు. ప్రదర్శనలో 550కు పైగా ఎగ్జిబిటర్లు తమ ఉత్పత్తులు, అత్యాధునిక సాంకేతికతలను ప్రదర్శించనుండగా భారత్‌తోపాటు విదేశాల నుంచి 50వేలకు పైగా వ్యాపార సందర్శకులు హాజరుకానున్నారు. ఈ ప్రదర్శనలో గుజరాత్‌కు చెందిన సుమారు 160 కంపెనీలు, తెలంగాణ, ఏపీలకు చెందిన 110 ఎగ్జిబిటర్లు, చైనాకు చెందిన దాదాపు 40 కంపెనీలు పాల్గొంటున్నాయి. ప్రారంభ కార్యక్రమంలో టాప్మా అధ్యక్షుడు నరేంద్ర బద్వా, హిప్లెక్స్ కన్వీనర్ మీలా జయదేవ్, ఏఐపీఎంఏ ఉపాధ్యక్షుడు వెన్నం అనిల్ రెడ్డి, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఎన్.భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అమెరికాలో జన్మ హక్కు పౌరసత్వం అంత ఈజీ కాదు

- కీలక నిర్ణయం దిశగా ట్రంప్ ముందడుగు



న్యూఢిల్లీ, ఆగస్ట్ 7, సిరి న్యూస్:

అమెరికాలో జన్మహక్కు పౌరసత్వం నిబంధనలను కఠినతరం చేసే దిశగా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో కీలక ముందడుగు వేశారు. ఈ అంశంపై సుప్రీంకోర్టు నుంచి ఎదురుదెబ్బ తగిలిన కొన్ని వారాలకే, ఆ నిబంధనలను పరిమితం చేసేలా రెండు కొత్త ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లపై గురువారం ఆయన సంతకం చేశారు. గతంలో జారీ చేసిన విస్తృత ఆదేశాలతో పోలిస్తే ఇవి పరిమిత స్థాయిలో ఉన్నప్పటికీ, వీటిపై కూడా న్యాయపరమైన సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. మొదటి ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ ప్రకారం, కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో అమెరికాలో జన్మించిన పిల్లలకు పౌరసత్వం దక్కకుండా నిబంధనలు విధించారు. ఇద్దరు తల్లిదండ్రులు అమెరికా పౌరులు కానప్పుడు, వారిలో ఒకరిని 'శత్రు దేశస్థుడు'గా, అంటే విదేశీ ఉగ్రవాద సంస్థల్లో సభ్యుడిగా గుర్తిస్తే, వారి పిల్లలకు పౌరసత్వం వర్తించదు. దీంతోపాటు దౌత్యపరమైన మినహాయింపులు ఉన్న విదేశీ ప్రభుత్వ ఉద్యోగులు, కేవలం పౌరసత్వం కోసమే చేసుకున్న వాణిజ్య ఒప్పందాలు (కొన్ని సరోగసీ కేసులు), ఫెడరల్ చట్టం ద్వారా పౌరసత్వం కల్పించని టెరిటరీల లో జన్మించిన వారికి కూడా ఈ నిబంధన వర్తిస్తుంది. ఇక, రెండో ఆదేశం పూర్తిగా 'బర్త్ టూరిజం'ను లక్ష్యంగా చేసుకుంది. కేవలం బిడ్డకు అమెరికా పౌరసత్వం ఇప్పించడం కోసమే దేశానికి వచ్చేవారిని అడ్డుకోవాలని ఈ ఉత్తర్వులో స్పష్టం చేశారు. ఇలాంటి వారికి వీసాలు నిరాకరించడం, అధికారిక అనుమతులు రద్దు చేయడం, దేశంలోకి ప్రవేశాన్ని నిరోధించడం వంటి కఠిన చర్యలు తీసుకోవాలని హోంల్యాండ్ సెక్యూరిటీ, విదేశాంగ శాఖలను ఆదేశించారు. కాగా, 14వ రాజ్యాంగ సవరణ కింద అమెరికాలో పుట్టిన దాదాపు ప్రతి ఒక్కరికీ పౌరసత్వం లభిస్తుందని జూన్ 30న 'ట్రంప్ వర్సెస్ బార్బరా' కేసులో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఈ తీర్పు జన్మహక్కు పౌరసత్వాన్ని ఒక 'జోక్'గా మార్చిందని ట్రంప్ విమర్శించారు. అందుకే తమ ప్రభుత్వం 'కొన్ని సర్దుబాట్లు' చేస్తోందని వ్యాఖ్యానించారు. చారిత్రకంగా దౌత్యవేత్తలు, ఆక్రమణ దళాలకు చెందిన వారికి మాత్రమే ఈ నిబంధన నుంచి మినహాయింపులు ఉండేవి. ఇప్పుడు ట్రంప్ జారీ చేసిన ఈ కొత్త ఆదేశాలు సుప్రీంకోర్టు తీర్పులో పేర్కొన్న మినహాయింపుల పరిధిలోనే ఉన్నప్పటికీ, వాటి సరిహద్దులను పరీక్షించేలా ఉన్నాయని, ఇవి కూడా న్యాయస్థానంలో సవాలుకు గురయ్యే అవకాశం ఉందని విశ్లేషకులు అంటున్నారు.




# మెటాకు రూ.5,400 కోట్ల జరిమానా

- అమెరికా కోర్టు భారీ షాక్

న్యూఢిల్లీ, ఆగస్ట్ 7, సిరి న్యూస్:

సోషల్ మీడియా దిగ్గజం మెటాకు అమెరికా కోర్టులో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ ప్లాట్‌ఫామ్‌ల వల్ల యువత మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోందని నిర్ధారించిన న్యూ మెక్సికో కోర్టు కంపెనీకి 567 మిలియన్ డాలర్ల (సుమారు రూ. 5,400 కోట్లకు పైగా) జరిమానా విధిస్తూ సంచలన తీర్పు ఇచ్చింది. ఈ కేసు విచారణలో భాగంగా రెండో దశలో జడ్జి బ్రయాన్ బీడ్‌షీడ్ ఈ ఆదేశాలు జారీ చేశారు. తీర్పు ప్రకారం జరిమానా మొత్తంలో 420 మిలియన్ డాలర్లు సోషల్ మీడియా వల్ల ప్రభావితమైన యువతకు చికిత్సా సేవల కోసం కేటాయించాలని న్యాయస్థానం స్పష్టం చేసింది. మిగిలిన నిధులను రాబోయే ఐదేళ్లలో అవగాహన, నివారణ కార్యక్రమాలు, స్క్రీనింగ్ సేవలు, ఇతర సంబంధిత ఖర్చుల కోసం వినియోగించాలని ఆదేశించింది. ఈ కేసులో గత మార్చి లో వెలువడిన తీర్పునకు ఇది కొనసాగింపు కావడం గమనార్హం. ఆ సమయంలో మెటా ఉద్దేశపూర్వకంగానే పిల్లల మానసిక ఆరోగ్యానికి హాని కలిగించిందని, లైంగిక దోపిడీకి సంబంధించిన సమాచారాన్ని దాచిపెట్టిందని నిర్ధారించిన జ్యూరీ కంపెనీకి 375 మిలియన్ డాలర్ల సివిల్ పెనాల్టీ విధించింది. ఈ కేసు విచారణలో ప్రాసిక్యూటర్లు మెటా ప్లాట్‌ఫామ్‌లలో కీలక మార్పులు చేయాలని కోరారు. ముఖ్యంగా యువతను వ్యసనపరులుగా మార్చే ఫీచర్లను నియంత్రించాలని, వయసు నిర్ధారణ పద్ధతులను కఠినతరం చేయాలని, పిల్లల లైంగిక దోపిడీని అరికట్టేందుకు డిఫాల్ట్ ప్రైవసీ సెట్టింగులను మెరుగుపరచాలని వాదించారు. అయితే, ప్రాసిక్యూటర్ల అభ్యర్థనలను కోర్టు పాక్షికంగానే అంగీకరించింది. 13 ఏళ్లలోపు పిల్లలకు వయసు నిర్ధారణను తప్పనిసరి చేయాలన్న వాదనను తోసిపుచ్చింది. అమెరికాలోని చిల్డ్రన్స్ ఆన్‌లైన్ ప్రైవసీ ప్రొటెక్షన్ యాక్ట్(సీఓపీపీఏ) ప్రకారం కేవలం వయసు నిర్ధారణ కోసం పిల్లల నుంచి వ్యక్తిగత సమాచారం సేకరించడం కుదరదని కోర్టు స్పష్టం చేసింది. అంతేగాక ఇతర సోషల్ మీడియా కంపెనీలకు లేని నిబంధనలను మెటాపై మాత్రమే విధించడం సరికాదని, అది కంపెనీపై అనవసర భారం మోపుతుందని అభిప్రాయపడింది. ఈ తీర్పుపై మెటా ఇంకా స్పందించలేదు. ఇటీవల మెటాకు చెందిన ఏఐ మోడల్ సైబర్ సెక్యూరిటీ పరీక్షల్లో భాగంగా బయటి సర్వీస్‌లోకి హ్యాక్ చేయడం, టెక్నాలజీపై నియంత్రణకు సంబంధించి కొత్త ఆందోళనలను రేకెత్తించింది.

# వందేమాతరానికి జాతీయ గీతంతో సమాన హోదా



న్యూఢిల్లీ, ఆగస్టు 7, సిరి న్యూస్:

భారత స్వాతంత్ర్య పోరాటంలో ప్రజల్లో దేశభక్తిని రగిలించిన 'వందేమాతరం' గీతానికి అత్యున్నత అధికారిక గుర్తింపు లభించింది. వందేమాతరానికి జాతీయ గీతం 'జనగణమన'తో సమానమైన హోదా కల్పించేలా రూపొందించిన కొత్త చట్టానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదముద్ర వేశారు. దీంతో బిల్లు చట్టరూపం దాల్చినట్లు పేర్కొంటున్నారు.

**అవమానిస్తే కఠిన చర్యలు**

కొత్త చట్టం ప్రకారం వందేమాతరం గీతాన్ని ఉద్దేశపూర్వకంగా అడ్డుకోవడం, బహిరంగంగా అవమానించడం లేదా హేళన చేయడం తీవ్రమైన నేరంగా పరిగణించే నిబంధనలు అమల్లోకి రానున్నాయి. పాఠశాలలు, ప్రభుత్వ కార్యక్రమాలు, బహిరంగ సభల్లో గీతాలాపన జరుగుతున్న సమయంలో ఉద్దేశపూర్వకంగా విఘాతం కలిగించినా చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది.

**జాతీయ భావనకు ప్రాధాన్యం**

జనగణమన ఆలాపన సమయంలో పాటించే విధంగానే వందేమాతరం విషయంలోనూ గౌరవం, క్రమశిక్షణ పాటించేలా నిబంధనలు రూపొందించినట్లు తెలుస్తోంది. స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన వందేమాతరానికి అధికారికంగా సమాన హోదా కల్పించడం ద్వారా జాతీయ భావనను మరింత బలోపేతం చేయాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొంటున్నారు.

# పార్లమెంట్‌లో చురుగ్గా వ్యవహరించండి

న్యూఢిల్లీ, ఆగస్టు 7, సిరి న్యూస్:

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ప్రతిపక్షాల ఆందోళనలు, సభా కార్యకలాపాలకు పదేపదే అంతరాయాలు ఎదురవుతున్న నేపథ్యంలో అధికార ఎన్డీఏ కూటమి లోక్‌సభ సభ్యులతో ప్రధాని నరేంద్ర మోదీ అల్పాహార సమావేశం నిర్వహించారు. సభలో ఎంపీలు చురుగ్గా పాల్గొని తమ అభిప్రాయాలను సమర్థంగా వినిపించాలని సూచించినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. పార్లమెంట్ ప్రజాస్వామ్యానికి అత్యున్నత వేదిక అని పేర్కొంటూ, సభలో జరుగుతున్న అంతరాయాలపై మోదీ ఆందోళన వ్యక్తం చేసినట్లు సమాచారం. గందరగోళం కారణంగా కొత్తగా ఎన్నికైన ఎంపీలకు తమ అభిప్రాయాలను వెల్లడించే అవకాశం తగ్గుతోందని మోదీ పేర్కొన్నట్లు తెలుస్తోంది. పార్లమెంట్ చరిత్రను అధ్యయనం చేసి, గతంలో జరిగిన కీలక చర్చలు, పరిణామాలను అర్థం చేసుకుని వాటిని ప్రస్తుత చర్చలకు ఉపయోగించుకోవాలని సూచించారు. రాష్ట్రాల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని, రాష్ట్రాలు పురోగమిస్తేనే దేశం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులను వేగంగా చేపట్టేందుకు అందుబాటులో ఉన్న అవకాశాలను సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు.

**భాగస్వామ్య పక్షాలకు భరోసా**

సమావేశానికి ఎన్డీఏలోని వివిధ భాగస్వామ్య పార్టీలకు చెందిన 40 మందికిపైగా లోక్‌సభ ఎంపీలు హాజరైనట్లు సమాచారం. శివసేన, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అథవాలే), రాష్ట్రీయ లోక్ మోర్చా, అన్నాడీఎంకే, యూపీపీఎల్ తదితర పార్టీల సభ్యులు పాల్గొన్నారు. ఇటీవల తృణమూల్ కాంగ్రెస్ నుంచి వైదొలిగి ఎన్సీపీఐలో చేరిన ఎంపీలు, ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన (యూబీటీ) నుంచి బయటకు వచ్చి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేనలో చేరిన ఎంపీలతో మోదీ ప్రత్యేకంగా మాట్లాడినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా వారికి అండగా



ఉంటానని భరోసా ఇచ్చినట్లు సమాచారం. ఎన్డీఏ ఒక కుటుంబం వంటిదని, కూటమిలోని ప్రతి భాగస్వామ్య పార్టీకి సమాన గౌరవం, అవకాశాలు ఉంటాయని స్పష్టం చేసినట్లు వర్గాలు వెల్లడించాయి. నియోజకవర్గాల అభివృద్ధి పనులకు అవసరమైన సహకారం కోసం నేరుగా ప్రధానమంత్రి కార్యాలయాన్ని సంప్రదించవచ్చని ఎంపీలకు సూచించారు. పేదలు, కార్మికులు, రైతులు సహా వివిధ వర్గాల ప్రజలను కలుసుకుని వారి సమస్యలను తెలుసుకోవాలని చెప్పారు. సమావేశం ముగిసిన అనంతరం ఎంపీలతో వ్యక్తిగతంగా మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నట్లు సమాచారం.

**బీజేపీ ఎంపీలతోనూ భేటీ**

వర్షాకాల సమావేశాల సందర్భంగా ఎన్డీఏ ఎంపీలతో మోదీ నిర్వహిస్తున్న వరుస సమావేశాల్లో భాగంగానే ఈ భేటీ జరిగింది. దీనికి ఒకరోజు ముందు తన అధికారిక నివాసంలో 37 మంది బీజేపీ లోక్‌సభ సభ్యులతో ప్రధాని విందు సమావేశం నిర్వహించారు. పాలన, పార్లమెంటరీ వ్యవహారాలతో పాటు పలు అంశాలపై ఎంపీలతో చర్చించినట్లు తెలుస్తోంది. ఢిల్లీలో వినిపించే రాజకీయ ప్రచారాల ప్రభావానికి లోనుకాకుండా జాగ్రత్తగా ఉండాలని, ప్రతిపక్ష ఎంపీలతోనూ సత్సంబంధాలు కొనసాగించాలని మోదీ సూచించినట్లు సమాచారం.

# కాంగ్రెస్ ఉద్యమం కన్నా సీజేపీ ఉద్యమానికే ఎక్కువ స్పందన

- శశి థరూర్ ఆసక్తికర వ్యాఖ్యలు
- కాంగ్రెస్ ప్రచారం కన్నా సీజేపీ ఉద్యమానికే ఎక్కువ ఆదరణ లభించిందని వ్యాఖ్య
- విద్యార్థుల సమస్యలను రాహుల్ గాంధీ ముందే ప్రస్తావించారని వెల్లడి
- ప్రజల నాడిని పట్టుకోవడంలో కాంగ్రెస్ వెనుకబడిందని అంగీకారం
- 2029 ఎన్నికల్లో జెన్-జీ ఓటర్లు అత్యంత కీలకం కానున్నారని వ్యాఖ్య



సిరి న్యూస్

కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ శశిథరూర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. విద్యార్థుల సమస్యలు, పరీక్షల్లో అక్రమాలపై తమ పార్టీ నేత రాహుల్ గాంధీ 'ఛాత్రోం కీ గూంజ్' పేరిట ప్రచారం నిర్వహించినప్పటికీ, ఆ తర్వాత వెలుగులోకి వచ్చిన 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) ఉద్యమానికే ప్రజల నుంచి, ముఖ్యంగా విద్యార్థుల నుంచి భారీ స్పందన లభించిందని ఆయన అంగీకరించారు.

ముంబైలో జరిగిన ఒక కార్యక్రమంలో శశిథరూర్ మాట్లాడుతూ, "సీజేపీ చేపట్టిన అంశాలనే మా పార్టీ, రాహుల్ గాంధీ 'ఛాత్రోం కీ గూంజ్' ద్వారా కొన్నిరోజుల ముందే లేవనెత్తారు. కానీ ఆ ప్రచారానికి ఎందుకు ఆశించిన స్థాయిలో స్పందన రాలేదో మేం సమీక్షించుకోవాల్సిన అవసరం ఉంది. ప్రజల నాడిని మేము సరిగ్గా పట్టుకోవాలి" అని వ్యాఖ్యానించారు.

రాజస్థాన్‌లోని కోటాలో జూన్ 17న రాహుల్ గాంధీ ఈ ప్రచారాన్ని ప్రారంభించగా, సీజేపీ నిరసనలు జూన్ 20న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద మొదలయ్యాయి. సీజేపీ ఉద్యమం దేశవ్యాప్తంగా విస్తరించి, అప్పటి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు దారితీసిన విషయాన్ని శశిథరూర్ ఈ సందర్భంగా పరోక్షంగా ప్రస్తావించారు.

2029 నాటికి 'జెన్‌జీ' అతిపెద్ద ఓటింగ్ వర్గంగా మారుతుందని, వారి ఆకాంక్షలను రాజకీయ పార్టీలు అర్థం చేసుకోవాలని శశిథరూర్ సూచించారు. "వీధిలో చేయాల్సిన పోరాటం వీధిలో, సభలో చేయాల్సిన పోరాటం సభలో చేయాలి" అంటూ తమ పార్టీ వ్యూహంపై తన అభిప్రాయాన్ని పునరుద్ఘాటించారు.

ఐఐఎంయూఎన్ వార్షికోత్సవ కార్యక్రమానికి ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ హాజరు కావడం, అదే వేదికపై శశిథరూర్ కూడా కనిపించడంపై వస్తున్న విమర్శలను ఆయన తోసిపుచ్చారు. భిన్నమైన అభిప్రాయాలు ఉన్న వారితో చర్చించవద్దని చెప్పడం సరికాదని, తాను కాంగ్రెస్ పార్టీకి విధేయుడిగానే ఉంటూ తన స్వతంత్ర అభిప్రాయాలను వ్యక్తం చేస్తానని ఆయన స్పష్టం చేశారు.



# పార్లమెంట్ సమావేశాలకు హాజరవ్వండి

- పార్టీ ఎంపీలకు విప్ జారీ చేసిన కాంగ్రెస్

న్యూఢిల్లీ, ఆగస్టు 7, సిరి న్యూస్:

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో కీలక అంశాలు చర్చకు రానున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఉభయ సభల్లోని తమ ఎంపీలకు విప్ జారీ చేసింది. ఆగస్టు 10, 11, 12 తేదీల్లో ఎంపీలంతా తప్పనిసరిగా సభకు హాజరు కావాలని ఆదేశించింది. ప్రతిరోజూ ఉదయం 11 గంటల నుంచి సభ వాయిదా పడే వరకు అందుబాటులో ఉండాలని స్పష్టం చేసింది.

**కీలక బిల్లులపై చర్చ**

ఈ మూడు రోజుల్లో పార్లమెంట్‌లో పలు కీలక అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉండటంతో కాంగ్రెస్ అధిష్ఠానం ఎంపీల హాజరును తప్పనిసరి చేసింది. ఇండియా కూటమిలోని భాగస్వామ్య పార్టీల ఎంపీలు కూడా సభలో అందుబాటులో ఉండి ప్రతిపక్షానికి మద్దతివ్వాలని కోరింది.

**ఎఫ్‌సీఆర్ఏ సవరణ బిల్లుపై ప్రతిపక్షాల వ్యతిరేకత**

విదేశీ విరాళాల క్రమబద్ధీకరణ సవరణ బిల్లు వచ్చే వారం పార్లమెంట్‌లో చర్చకు వచ్చే అవకాశం ఉందన్న నేపథ్యంలో కాంగ్రెస్ విప్ ప్రాధాన్యం సంతరించుకుంది. స్వచ్ఛంద సంస్థలు స్వీకరించే విదేశీ నిధుల నియంత్రణ, నిబంధనల ఉల్లంఘనకు సంబంధించిన ఆస్తుల స్వాధీనం వంటి అంశాలపై ప్రతిపాదిత మార్పులను కాంగ్రెస్‌తో పాటు ఇతర ప్రతిపక్ష పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి.

**డీలిమిటేషన్‌పైనా చర్చకు అవకాశం**

డీలిమిటేషన్‌కు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లుపైనా పార్లమెంట్‌లో చర్చ జరిగే అవకాశం ఉందన్న ప్రచారం నేపథ్యంలో కాంగ్రెస్ అప్రమత్తమైంది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలను సభలో సమర్థంగా ప్రశ్నించేందుకు ఎంపీలంతా సమన్వయంతో వ్యవహరించాలని పార్టీ సూచించింది.

ఆగస్టు 10 నుంచి 12 వరకు జరిగే సమావేశాల్లో ప్రతిపక్షం ఐక్యంగా వ్యవహరించేలా కాంగ్రెస్ వ్యూహం సిద్ధం చేస్తోంది. కీలక బిల్లుల విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరిని పార్లమెంట్ వేదికగా గట్టిగా ప్రశ్నించాలని పార్టీ నిర్ణయించింది.






# చేనేత భారత సంస్కృతికి అద్దం

- సంప్రదాయ కళకు ఆధునిక మార్కెట్ అనుసంధానం అవసరం: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

న్యూఢిల్లీ, ఆగస్టు 7, సిరి న్యూస్:

12వ జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు రాష్ట్రపతి భవన్ సాంస్కృతిక కేంద్రంలో ఘనంగా జరిగాయి. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్య అతిథిగా పాల్గొని సంత్ కబీర్ చేనేత పురస్కారాలు, జాతీయ చేనేత పురస్కారాలు-2025 విజేతలకు అవార్డులు అందజేశారు. భారత నాగరికత పరిణామ క్రమంలో చేనేతకు శతాబ్దాల చరిత్ర ఉందని, దేశ సంస్కృతి, సంప్రదాయాలు, ప్రాంతీయ ప్రత్యేకతలను ప్రతిబింబించే గొప్ప వారసత్వంగా ఈ రంగం నిలిచిందని రాష్ట్రపతి పేర్కొన్నారు.

**వైవిధ్యాన్ని ప్రపంచానికి పరిచయం**

దేశంలోని వివిధ ప్రాంతాల కళాత్మక నైపుణ్యాన్ని చేనేత ఉత్పత్తులు ప్రపంచానికి పరిచయం చేస్తున్నాయని ద్రౌపది ముర్ము అన్నారు. ఒక్కో ప్రాంతానికి ప్రత్యేకమైన నేసిన వస్త్రాలు భారతదేశంలోని సాంస్కృతిక వైవిధ్యాన్ని ప్రతిబింబిస్తున్నాయని తెలిపారు. తరతరాలుగా వస్తున్న సంప్రదాయ చేనేత కళలను పరిరక్షిస్తూ వాటిని భవిష్యత్ తరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు.

**ఆధునిక రూపకల్పనలతో అనుసంధానం**

సంప్రదాయ చేనేత కళలకు ఆధునిక రూపకల్పనలను జోడించాల్సిన అవసరం ఉందని రాష్ట్రపతి సూచించారు. సమర్థవంతమైన బ్రాండింగ్, అంతర్జాతీయ మార్కెట్లతో అనుసంధానం ద్వారా చేనేత ఉత్పత్తులకు మరింత విస్తృత అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. యువ పారిశ్రామికవేత్తలు, రూపకర్తలు, నవ్య ఆలోచనలతో పనిచేసే సంస్థలు ఈ రంగంలోకి వస్తే కొత్త అవకాశాలు ఏర్పడతాయని చెప్పారు.

**కళాకారుల కృషి ప్రశంసనీయం**

చేనేత రంగం లక్షలాది కుటుంబాలకు ఉపాధి కల్పించడంతో పాటు దేశ సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షిస్తోందని ద్రౌపది ముర్ము తెలిపారు. చేనేత కళాకారులు కొనసాగిస్తున్న సంప్రదాయ నైపుణ్యం దేశానికి గర్వకారణమని కొనియాడారు. వారి కృషిని గుర్తించి జాతీయ స్థాయి పురస్కారాలతో గౌరవించడం సంతోషకరమని పేర్కొన్నారు. సంప్రదాయ నైపుణ్యాన్ని ఆధునిక మార్కెట్ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దితే భారత చేనేతకు ప్రపంచవ్యాప్తంగా మరింత గుర్తింపు లభిస్తుందని రాష్ట్రపతి అన్నారు.



# ప్రజల కష్టాలు తీర్చడమే ధ్యేయం

- ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యత
- రూ.8.55 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**అమీన్ పూర్ ఆగస్టు 07 సిరి న్యూస్**

అమీన్ పూర్ సర్కిల్ బీరంగూడ డివిజన్ పరిధిలోనీ వివిధ కాలనీలో రూ. 8. 55 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మౌలిక వసతుల విస్తరణ డివిజన్లో రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సౌకర్యాలు మరియు వీధి దీపాల ఏర్పాటుకు ప్రాధాన్యత, ప్రణాళిక బద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని ఆయన తెలిపారు. నిర్ణీత కాల పరిమితిలోగా అభివృద్ధి పనులన్నింటినీ నాణ్యత ప్రమాణాలతో పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, దేవానంద్ ముదిరాజ్, సుధాకర్ రెడ్డి, నందారం నరసింహ గౌడ్, డి ఈ వెంకటరమణ, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదవశత్తు కరెంట్ షాక్ తో పాడి గేదె మృతి

**పాపన్నపేట ఆగస్టు 07 సిరి న్యూస్:**



ప్రమాదవశత్తు ట్రాన్స్ఫార్మర్ వద్ద కరెంట్ షాక్ తగిలి పాడి గేద అక్కడికి అక్కడిని మృతి చెందింది. పాపన్నపేట మండల పరిధిలో గల ఎన్కెపల్లికి చెందిన ఎండి షాకీర్ కు చెందిన పాడి గేదలు ప్రతిరోజు లాగే ఎనే చౌరస్తా నుండి ఎన్కేపల్లి శివార్లో మేతకు వెళ్తాయి. శుక్రవారం యేనే చౌరస్తా సమీపంలోని ప్రధాన రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్ఫారం వద్ద కు గేదె మేసుకుంటూ వెళ్ళింది. ప్రమాదవశత్తు కరెంట్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ సుమారు లక్ష రూపాయలు ఉంటుందని బాధితులు తెలిపారు. ప్రధాన రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్ఫార్మర్ కు కనీసం కంచె ఏర్పాటు చేయ లేదని, అందువల్లే ఈ ప్రమాదం జరిగిందని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంగానే పాడిగేద మృతి చెందని ఆరోపించారు.

# బోనాల ఏర్పాట్లను పరిశీలించిన బూరుగడ్డ పుష్పనగేష్..



**రామచంద్రాపురం, ఆగస్టు 7 (సిరి న్యూస్):**

రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని ఓల్డ్ రామచంద్రాపురం, శ్రీనివాస్ నగర్ కాలనీతో పాటు పలు ప్రాంతాల్లో ఆదివారం జరగనున్న ఆషాఢమాస బోనాల ఉత్సవాల ఏర్పాట్లను రామచంద్రాపురం తాజా మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఓల్డ్ రామచంద్రాపురంలోని శ్రీశ్రీశ్రీ పోచమ్మ తల్లి ఆలయాన్ని సందర్శించి, ఆలయ పరిసరాల్లో పారిశుద్ధ్యం, డస్ట్, లైటింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం శ్రీనివాస్ నగర్ కాలనీ, కసిరెడ్డిపల్లి, మల్లికార్జున నగర్, రామచంద్రారెడ్డి నగర్, మయూరి నగర్, కనుకుంట ప్రాంతాల్లో కూడా బోనాల ఉత్సవాలు జరగనున్న నేపథ్యంలో అవసరమైన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేసి, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు..

# విద్యుత్ షాక్ తో యువకుడు మృతి

## ఫ్లెక్సీ ఏర్పాటు చేసే క్రమంలో

**నర్సాపూర్ ఆగస్టు 7 (సిరి న్యూస్)**



బోనాల పండుగ సందర్భంగా ఫ్లెక్సీ ఏర్పాటు చేసే క్రమంలో విద్యుత్ షాక్ తో యువకుడు మృతి చెందిన సంఘటన నర్సాపూర్ పట్టణంలో శుక్రవారం జరిగింది పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నర్సాపూర్ పట్టణంలో రెండు రోజులలో బోనాల పండుగ ఉండడంతో తన మిత్రులతో కలిసి శివాలయం వీధిలో శుక్రవారం ఉదయం ఫ్లెక్సీ ఏర్పాటు చేయడానికి చెట్లు తొలగించే సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తో మలపర్తి హర్షవర్ధన్(19) మృతి చెందారు మిత్రులు అఖిల్ బాబు, ఇర్ఫాన్ రక్షించే సమయంలో వారికి గాయాలు కావడంతో చికిత్స కోసం సంగారెడ్డిలో ప్రైవేట్ ఆసుపత్రిలో తీసుకెళ్లారని హర్షవర్ధన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై రంజిత్ కుమార్ రెడ్డి తెలిపారు

# మంజీరా విద్యాలయంలో ఘనంగా బోనాల సంబరాలు






- **పోతరాజు నృత్యాలు, అమ్మవారి అలంకరణతో ఆధ్యాత్మిక వాతావరణం.**

**రామాయంపేట, ఆగస్టు 7 )సిరి న్యూస్)**

రామాయంపేట పట్టణంలోని మంజీరా విద్యాలయంలో బోనాల పండుగను అత్యంత భక్తిశ్రద్ధలతో, సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన బోనాల పండుగను పురస్కరించుకుని విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి పాఠశాల ఆవరణను ఆధ్యాత్మిక వాతావరణంతో నింపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో అమ్మవారిని వేపాకులు, పూలతో సుందరంగా అలంకరించారు. విద్యార్థినులు సంప్రదాయ వస్త్ర ధారణలో తలపై బోనాలు ఎత్తుకుని డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. బోనాల పండుగ విశిష్టత, తెలంగాణ సంస్కృతిలో దాని ప్రాముఖ్యత, ఆషాఢ మాసంలో అమ్మవారిని ఆరాధించే సంప్రదాయం గురించి ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. బోనాల పండుగ వెనుక ఉన్న శాస్త్రీయ కారణాలను కూడా ఈ సందర్భంగా వివరించారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే సమయంలో పసుపు, వేపాకులు, మామిడి ఆకులు వంటి సహజ సిద్ధమైన పదార్థాల వినియోగం ఆరోగ్య రక్షణకు ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. ప్రతి పండుగ వెనుక సామాజిక, సాంస్కృతిక విలువలతో పాటు శాస్త్రీయ అంశాలు కూడా దాగి ఉన్నాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు వల్లభ్ సాయి, శ్రేయాస్, రిత్విక్ రెడ్డి పోతరాజు వేషధారణలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వారి ఉత్సాహభరితమైన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అద్వితి అమ్మవారి ఆవాహన రూపంలో రంగమెక్కి, విద్యార్థులంతా కష్టపడి చదివి పదో తరగతిలో మంజీరా విద్యాలయానికి జిల్లా స్థాయి ర్యాంకు తీసుకురావాలని ఆశీర్వదిస్తూ భవిష్యవాణి పలకడం కార్యక్రమానికి విశేష ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ జితేందర్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించడం కూడా విద్యాసంస్థ బాధ్యతేనని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సంస్కృతి పట్ల గౌరవాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సురేష్, అనిల్, శ్రీశైలం, మౌనిక, మీనా, శ్రీనిత, శిరీష, సంధ్య, వసుంధరతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# భానూరు లోని భారత్ డైనమిక్స్ లిమిటెడ్ ను సందర్శించిన గీతం విద్యార్థులు





## క్షిపణి సాంకేతిక పై ప్రత్యక్ష అవగాహన

**పటాన్ చెరు, ఆగస్టు 7, (సిరి న్యూస్)**

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులోని కంప్యూటర్ సైన్స్ అండ్ సిస్టమ్స్ ఇంజనీరింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్ (ఏఐడీఎస్) విభాగాల విద్యార్థులు, భారతదేశంలోని ప్రముఖ రక్షణ ఉత్పాదక సంస్థలలో ఒకటైన భానూరులోని భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్)ను సందర్శించి, భారతదేశపు అధునాతన క్షిపణి సాంకేతికతపై ప్రత్యక్ష అవగాహనతో పాటు విలువైన పారిశ్రామిక అనుభవాన్ని పొందారు. ఈ పర్యటన సందర్భంగా, విద్యార్థులు ఆధునిక క్షిపణి సాంకేతికతలపై ఒక విజ్ఞానదాయక సదస్సులో పాల్గొన్నారు. అలాగే వారికి మిలన్, కొంకుర్స్, ఇన్వర్, కొంకుర్స్-ఎం వంటి ట్యాంక్ విధ్వంసక గైడెడ్ క్షిపణి వ్యవస్థల గురించి బీడీఎల్ అధికారులు పరిచయం చేశారు. అంతే కాకుండా, ఆస్త్రా గగనతల క్షిపణి, దానిని ఎస్.యూ-30, మిరాజ్ యుద్ధ విమానాలలో అనుసంధానించడం గురించి తెలుసుకునే అవకాశం కూడా వారికి లభించింది. గీతం విద్యార్థి బృందం బీడీఎల్ లోని ప్రెసిషన్ మ్యానుఫ్యాక్చరింగ్ విభాగాన్ని పర్యటించి, అక్కడ అత్యంత కచ్చితత్వంతో కూడిన సీ.ఎన్.సీ. మెషిన్లు, కీలకమైన క్షిపణి భాగాల ఉత్పత్తిని ప్రత్యక్షంగా పరిశీలించారు. కొంకుర్స్ క్షిపణి లాంచర్ వ్యవస్థ ప్రత్యక్ష ప్రదర్శన, క్షిపణి అసెంబ్లీ విభాగాన్ని సందర్శించడం ద్వారా, అధునాతన క్షిపణి వ్యవస్థల తుది అసెంబ్లీ, మోహరింపు యంత్రాంగాల గురించి విద్యార్థులకు ప్రత్యక్ష అవగాహన కలిగింది. రక్షణ ఇంజనీరింగ్, ప్రెసిషన్ మ్యానుఫ్యాక్చరింగ్, ఆటోమేషన్, స్వదేశీ సాంకేతిక ఆవిష్కరణలపై విద్యార్థుల అవగాహనను గణనీయంగా పెంచింది. అదే సమయంలో, తరగతి గది అభ్యాసాన్ని పారిశ్రామిక అనుభవంతో అనుసంధానించడం ప్రాముఖ్యతను కూడా ఇది నొక్కి చెప్పింది. గీతం స్కూల్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ లోని కంప్యూటర్ సైన్స్ అండ్ సిస్టమ్స్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ ప్రీతి అంబరీష్ పర్వేకర్ సమన్వయంతో జరిగిన ఈ పారిశ్రామిక పర్యటన, 30 మంది విద్యార్థులు, ఐదుగురు అధ్యాపకులకు భారతదేశపు స్వదేశీ క్షిపణి ఉత్పాదక సాంకేతికతలు, అధునాతన రక్షణ ఉత్పత్తి వ్యవస్థలను అర్థం చేసుకునే అవకాశాన్ని కల్పించింది. గీతం విద్యార్థి బృందాన్ని బీడీఎల్ మానవ వనరుల విభాగాధిపతి గంగయ్య స్వాగతించగా, అదే విభాగానికి చెందిన శిక్షణాధికారి నందని, ఇతర అధికారులు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులను ఉద్దేశించి బీడీఎల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ (హెచ్ఆర్) నాగేశ్వరరావు, దేశ రక్షణ సామర్థ్యాలను బలోపేతం చేయడంలో క్రమశిక్షణ, సమష్టి కృషి, సాంకేతిక నైపుణ్యం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. బీడీఎల్ యాజమాన్యం, సాంకేతిక నిపుణులు చూపిన ఆత్మీయ ఆతిథ్యానికి, అలాగే విద్యార్థులకు సుసంపన్నమైన అభ్యాస అనుభవాన్ని అందించినందుకు గీతం బృందం కృతజ్ఞతలు తెలియజేసింది. పారిశ్రామిక సందర్శనను విజయవంతంగా నిర్వహించి, భారతదేశ రక్షణ సాంకేతిక రంగంలో అనుభవపూర్వక అభ్యాసానికి వీలు కల్పించినందుకు ప్రొఫెసర్ ప్రీతి అంబరీష్ పర్వేకర్ ను ప్రత్యేకంగా అభినందించారు.

# జిల్లా బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో.. రేపు ఆషాఢ గోరింటాకు సంబరాలు

- **9న ముత్తాయికోటలో కుటుంబ సమేతంగా వేడుకలు .**
- **ప్రతిభావంతులైన విద్యార్థులకు సన్మానం.**
- **జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు శలాక రాజేశ్వర శర్మ, ప్రధాన కార్యదర్శి కాశీనాధరావు, కోశాధికారి హరికృష్ణ శర్మ.**





**రామాయంపేట,ఆగస్టు 7 (సిరి న్యూస్)**

మెదక్ జిల్లా బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీ (ఆదివారం) ముత్తాయికోటలోని శ్రీ సిద్ధిరామేశ్వర దేవస్థానంలో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని "గోరింటాకు సంబరాలు–2026" ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు శలాక రాజేశ్వర శర్మ,ప్రధాన కార్యదర్శి కాశీనాథరావు, కోశాధికారి హరికృష్ణ శర్మ తెలిపారు. గత ఏడాది నిర్వహించిన గోరింటాకు సంబరాలకు బ్రాహ్మణ కుటుంబాల నుంచి విశేష స్పందన లభించిందని, అదే ఉత్సాహంతో ఈ ఏడాది కూడా జిల్లా వ్యాప్తంగా ఉన్న బ్రాహ్మణ కుటుంబాలందరూ కుటుంబ సమేతంగా పాల్గొని ఈ వేడుకలను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మహిళల కోసం ప్రత్యేకంగా గోరింటాకు అలంకరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల సమక్షంలో భర్తలు తమ భార్యలకు గోరింటాకు పెట్టే సంప్రదాయ కార్యక్రమంతో పాటు అంత్యాక్షరి, సంగీత్, కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలతో రోజంతా ఆహ్లాదకర వాతావరణంలో వేడుకలు సాగనున్నాయని పేర్కొన్నారు. అలాగే విద్యారంగంలో ప్రతిభ కనబరిచిన పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు, ఐఐటీ, ఎన్ఐటీ, ఎంబీబీఎస్ తదితర ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులు, అలాగే వివిధ రంగాల్లో విశిష్ట ప్రతిభ కనబరిచిన చిన్నారులను జిల్లా బ్రాహ్మణ సంఘం తరఫున ఘనంగా సన్మానించనున్నట్లు వెల్లడించారు. యువతను ప్రోత్సహించడం, వారి ప్రతిభను గుర్తించి అభినందించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. కార్యక్రమానికి హాజరయ్యే వారికి అవసరమైన వసతి సౌకర్యం కూడా కల్పిస్తున్నట్లు చెప్పారు. మహిళలు, పురుషులు అందరూ సంప్రదాయ దుస్తుల్లో హాజరుకావాలని, కోలాటాల్లో పాల్గొనే వారు తమ కోలలను వెంట తీసుకురావాలని సూచించారు.. ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించి ఈ సామాజిక, సాంస్కృతిక వేడుకను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమానికి సంబంధించిన వివరాల కోసం సంఘం ప్రతినిధులను సంప్రదించవచ్చని తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు శలాక రాజన్న, ప్రధాన కార్యదర్శి గౌరీరాజ కాశీనాథ్ రావు, కోశాధికారి గౌరీచర్ల హరికృష్ణ శర్మ సంయుక్తంగా వెల్లడించారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలి: సింధు ఆదర్శ్ రెడ్డి..

**రామచంద్రపురం, ఆగస్టు 7 (సిరి న్యూస్):**



పటాన్‌చెరు నియోజకవర్గం భారతి నగర్ డివిజన్ పరిధిలోని ఓల్డ్ ఎంఐజీ కాలనీలో మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి శుక్రవారం ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు, పార్టీ కార్యకర్తలు, బూత్ స్థాయి ప్రతినిధులతో సమావేశమైన ఆయన, ఇప్పటికే నింపిన ఎన్యూమరేషన్ ఫారాలను సంబంధిత బీఎల్‌వో, బీఎల్ఏలతో తప్పనిసరిగా క్రాస్‌చెక్ చేసి ఆగస్టు 10లోపు సమర్పించాలని సూచించారు. చివరి గడువును దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో ప్రక్రియను పూర్తి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఓల్డ్ ఎంఐజీ బీ పార్క్‌లో నిర్మాణంలో ఉన్న కమ్యూనిటీ హాల్ పనులను పరిశీలించారు. తాను కార్పొరేటర్‌గా ఉన్న సమయంలో మంజూరైన ఈ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను నాణ్యతతో పాటు వేగంగా పూర్తి చేసి ప్రజలకు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రాణి యాదవ్, విజయలక్ష్మి , గాయత్రి, అరుణ, జ్యోతి, శ్రీనివాస్, వినోద్, జెబున్, తులసి, అఖిల, ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# మరోసారి పరమత సహనాన్ని చాటుకున్న ఎమ్మెల్యే జిఎంఆర్





- **రూ.25 లక్షల సొంత నిధులతో చోటి మసీదు భవన నిర్మాణానికి అండ**

**పటాన్ చెరు, ఆగస్టు 7, (సిరి న్యూస్)**

పరమత సహనం, సామరస్యానికి ప్రతీకగా నిలుస్తూ పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి (జిఎంఆర్) మరోసారి తన గొప్ప మనసును చాటుకున్నారు. పటాన్ చెరు డివిజన్ పరిధిలోని ఎంజి రోడ్డు లో గల చోటి మసీదు ప్రార్థన స్థలానికి చెందిన స్థలంలో 25 లక్షల రూపాయల సొంత నిధులతో భవనాన్ని నిర్మించి మసీదు నిర్వాహకులకు అందించారు.. ఈ మేరకు శుక్రవారం మత పెద్దల సమక్షంలో భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చోటి మసీదు ఆర్థిక అవసరాలు తీర్చడంలో నూతన భవనం సహాయకారిగా ఉంటుందని తెలిపారు. ప్రపంచంలోని అన్ని మతాలు శాంతి, ప్రేమ, మానవత్వాన్నే బోధిస్తాయని అన్నారు. మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరి మనోభావాలను గౌరవించడం ప్రజాప్రతినిధిగా తన బాధ్యత అని పేర్కొన్నారు. పటాన్ చెరు నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజలు సోదరభావంతో, పరస్పర గౌరవంతో జీవించే వాతావరణాన్ని మరింత బలోపేతం చేయడమే తన లక్ష్యమని తెలిపారు. నియోజకవర్గంలో పరమత సహనాన్ని పెంపొందించడంలో భాగంగా నేటి వరకు సొంత నిధులతో 200 లకు పైగా దేవాలయాలు, 100కు పైగా మసీదులు, 20 కి పైగా చర్చిలు నిర్మించడం జరిగిందని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దలు ఎమ్మెల్యే జిఎంఆర్ కు కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఆయన చేపడుతున్న సేవా కార్యక్రమాలు ఆదర్శప్రాయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, ముస్లిం మత పెద్దలు లియాకత్ అలీ, మొయిజుర్ రెహ్మాన్, ఇక్బాల్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

# సీపీపీడీ రోగులకు కిట్లు అందుబాటులో ఉంచాలి

- **ఈఎస్ఐ మెడికల్ డీన్ కు సీఐటీయూ వినతిపత్రం..**
- **కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేస్తామని హామీ**

**హైదరాబాద్, ఆగస్టు 7 (సిరి న్యూస్):**



సనత్ నగర్ ఈఎస్ఐ మెడికల్ కాలేజ్ & సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సీఏపీడీ రోగులకు అవసరమైన డయాలిసిస్ ఫ్లూయిడ్స్, కిట్లు, వైద్య సామగ్రిని తక్షణమే కొనుగోలు చేసి నిరంతరంగా అందుబాటులో ఉంచాలని కోరుతూ సీఐటీయూ ప్రతినిధులు శుక్రవారం మెడికల్ డీన్ డా. సీతామహాలక్ష్మికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ సంగారెడ్డి జిల్లా సీనియర్ నాయకుడు ఎం.డి. వాజిద్ అలీ మాట్లాడుతూ, ఈఎస్ఐ ప్రకటించిన "బీమా పొందిన కార్మికుడే మా వీఐపీ" అనే నినాదం ఆచరణలో కనిపించడం లేదని విమర్శించారు. కార్మికుల చందాలతో నడిచే ఈఎస్ఐ వ్యవస్థలోనే రోగులు తమ హక్కైన చికిత్స కోసం హైకోర్టును ఆశ్రయించాల్సిన పరిస్థితి రావడం బాధాకరమన్నారు. ప్రాణాలను కాపాడే సీఏపీడీ చికిత్సలో ఎలాంటి అంతరాయం లేకుండా అవసరమైన కిట్లు, వైద్య సామగ్రిని నిరంతరం అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. వినతిపత్రాన్ని స్వీకరించిన మెడికల్ డీన్ డా. సీతామహాలక్ష్మి సానుకూలంగా స్పందిస్తూ, అవసరమైన అనుమతులను తక్షణమే మంజూరు చేసి కిట్లు, వైద్య సామగ్రి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఈఎస్ఐసీ మాజీ బోర్డు సభ్యుడు అర్జున్ తో పాటు సీఏపీడీ రోగులు పాల్గొన్నారు.

# ఇందిరా పార్క్ వద్ద ధర్నాను విజయవంతం చేయండి

**ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్‌రెడ్డి పిలుపు**

**పాపన్నపేట, ఆగస్టు 7 సిరి న్యూస్:**





సెప్టెంబర్ 1న ఇందిరా పార్కు వద్ద హైదరాబాదులో నిర్వహించే మహా ధర్నాకు జయప్రదం చేయాలని ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆయన శుక్రవారం ఏడుపాయల వన దుర్గ భవాని మాతను దర్శించుకున్న అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం ఈ ధర్నా నిర్వహించ తలపెట్టామని, ఈ కార్యక్రమానికి కనివిని ఎరుగని రీతిలో ఉపాధ్యాయులు హాజరు కావాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పి ఆర్ సి నివేదికను వెంటనే తెప్పించుకొని ఉద్యోగులకు పిఆర్సి ప్రకటించాలని కోరారు. ఉపాధ్యాయులకు రావాల్సిన డి ఎ లను సత్వరమే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు . 2003 డిఎస్సి ఉపాధ్యాయులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించిన విధంగా ఓ పి ఎస్ ను అమలు చేయాలని ప్రభుత్వానికి సూచించారు. సిపిఎస్ ఉపాధ్యాయుల చిరకాల కోరిక అయినా ఓ పి ఎస్ ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎంప్లాయ్ హెల్త్ స్కీమ్ ను రాష్ట్రంలోని అన్ని హాస్పిటల్ లో పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పులగం దామోదర్ రెడ్డి, సుంకరి బిక్షం గౌడ్, మోహన్ రెడ్డి, పి ఆర్ టి యు టి ఎస్ అధికార ప్రతినిధి వంగ మహేందర్ రెడ్డి, ఆడిట్ కమిటీ చైర్మన్ సోమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మెదక్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మేడి సతీష్ రావు, సామ్యా నాయక్ మరియు జిల్లా గౌరవ అధ్యక్షులు సబ్బని శ్రీనివాస్ రాష్ట్ర ,జిల్లా, మండల బాధ్యులు సత్నారాయణరెడ్డి,వెంకట రామిరెడ్డి, మహేశ్,రామచంద్రాచారి, రాజు, సురేష్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# వెల్దుర్తి మండల అభివృద్ధి నా లక్ష్యం

**విద్యార్థులకు అండగా ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి**

**వెల్దుర్తి,ఆగస్టు 07 (సిరి న్యూస్ ):**

వెల్దుర్తి మండల అభివృద్ధి కోసం పార్టీల కతీతంగా నా వంతు సహాయ సహకారాలు అందిస్తానని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం నాడు వెల్దుర్తి మండల కేంద్రంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో అధ్యక్షతన మండల స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... మండల స్థాయి సమావేశాలకు అన్ని శాఖల అధికారులు సరైన పూర్తిస్థాయి సమాచారం అందించాలని శాఖల వారీగా సమస్యలు అవసరమైన పనులు వివరాలను అందిస్తే సాధ్యమైనంత తొందరగా పరిష్కరిస్తామని అన్నారు. ప్రభుత్వ అధికారులు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి ప్రజలు ఫోన్ చేస్తే తప్పనిసరిగా స్పందించాలని ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రజా ప్రతినిధులు ఆధికారులు ఎల్లప్పుడూ బాధ్యతగా వ్యవహరించివాటిని పరిష్కరించాలన్నారు. మండల సర్పంచులు మాట్లాడుతూ.. గ్రామాలలో పారిశుద్ధ పండ్లు అలాగే కొన్నిచోట్ల అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు సిసి రోడ్ల నిర్మాణాలకు ప్రభుత్వం నుంచి నిధులు విడుదలయితే వాటి ద్వారా అభివృద్ధి పనులు తొందరగా చేయవచ్చని ఎమ్మెల్యే సమక్షంలో తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ వెల్దుర్తి మండల అభివృద్ధే లక్ష్యం మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి నా వంతు కృషి చేస్తానని ప్రభుత్వం ద్వారా వచ్చే నిధులను కచ్చితంగా గ్రామాల అభివృద్ధికి ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటానని వారు హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే చింత లక్ష్మారెడ్డి ని వెల్దుర్తి మండల యువజన, విద్యార్థి విభాగం నాయకులు, జూనియర్ కళాశాల విద్యార్థులు, కలిసి మండల అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. మండలానికి రూ.33 కోట్ల వ్యయంతో మంజూరైన తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను వెల్దుర్తి మండల కేంద్రంలోనే ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ



ప్రతిపాదనపై ఎమ్మెల్యే వెంటనే సానుకూలంగా స్పందించి, "వెల్దుర్తి విద్యార్థుల భవిష్యత్తు కోసం నా వంతు పూర్తి కృషి చేస్తాను" అని హామీ ఇవ్వడమే కాకుండా, అందరి సమక్షంలో జిల్లా కలెక్టర్ తో ఫోన్‌లో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకోవాలని వారికి సూచించారు. అంతేకాకుండా, స్థానిక నాయకులు, గ్రామస్తులు, వెల్దుర్తి–మెదక్ ప్రధాన రహదారి దుస్థితి, సరైన రవాణా సౌకర్యాలు లేక విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, సాధారణ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎమ్మెల్యేకు వివరించారు. దీనిపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే మెదక్ డిపో మేనేజర్‌తో ఫోన్‌లో మాట్లాడి నర్సాపూర్–మెదక్ మార్గంలో రెగ్యులర్ బస్సు సర్వీసులు నడిచేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

### విద్యకు ప్రాధాన్యత... రవాణాకు భరోసా... అభివృద్ధికి అంకితభావం...

వెల్దుర్తి ప్రజల ఆకాంక్షలు నెరవేరే వరకు ప్రజల తరపున మా ప్రయత్నం నిరంతరం కొనసాగుతుంది. ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని గ్రామాల సర్పంచులు అధికారులు నాయకులు పాఠశాల, కళాశాల, విద్యార్థులు యువత పాల్గొన్నారు.

# సోలక్ పల్లిలో ఘనంగా బోనాల పండుగ..

**హాజరైన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**



**జిన్నారం ఆగస్టు 07 సిరి న్యూస్**

గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే జాతరలు తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకలని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. జిన్నారం మున్సిపల్ పరిధిలోని సోలకపల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన బోనాల పండుగ, జాతర కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై.. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను ప్రతి ఒక్కరూ భక్తి, ఐకమత్యంతో నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిన్నారం మున్సిపల్ చైర్మన్ జనార్ధన్, ఆయా వార్డుల కౌన్సిలర్లు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ఘనంగా 12వ జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు



**పాపన్నపేట,ఆగస్టు 07 సిరి న్యూస్ :**

జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకుని మండల కేంద్రమైన పాపన్నపేట చేనేత సహకార సంఘంలో శుక్రవారం నాడు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి మెదక్ జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షులు మ్యాకల జయరాములు, మెదక్ పద్మశాలి సంఘం అధ్యక్షులు బోద్దుల సంతోష్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా చేనేత జాతి పిత కొండా లక్ష్మణ్ బాపూజీ, మార్కండేయ మహరాజ్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఇటీవల నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాపన్నపేట పద్మశాలి సహకార సంఘం అధ్యక్షులు కొడపాక విట్టల్, మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు వళ్ళందేశి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు పల్లె సంగమేశ్వర్, డైరెక్టర్ లు పద్మశాలి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బాధితులకు అండగా భరోసా కేంద్రం.!



- **నాలుగేళ్లుగా మహిళలు, చిన్నారులకు సమన్వయంతో సేవలు.**
- **జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్.**

**మెదక్ ఆగష్టు,07(సిరి న్యూస్)**

మహిళలు,చిన్నారులపై జరిగే నేరాల్లో బాధితులకు అండగా నిలుస్తూ.వారికి అవసరమైన సహాయాన్ని ఒకే వేదికపై అందిస్తున్న భరోసా కేంద్రం నాలుగో వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ హాజరై కేక్ కట్ చేసి వార్షికోత్సవ వేడుకలను ప్రారంభించారు.ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ.. గత నాలుగు సంవత్సరాలుగా భరోసా కేంద్రం మహిళలు, చిన్నారులపై జరిగిన నేరాల బాధితులకు అండగా నిలుస్తూ, వారికి అవసరమైన కౌన్సెలింగ్,న్యాయ సహాయం,వైద్య సహాయం, పునరావాస సేవలను సమన్వయంతో అందిస్తోందన్నారు. బాధితులు నేరం జరిగిన తర్వాత ఎదుర్కొనే మానసిక ఒత్తిడి, భయాందోళనలను అధిగమించేలా వారికి ధైర్యం కల్పించడంతో పాటు, న్యాయం పొందే వరకు అవసరమైన సహకారం అందించడం భరోసా కేంద్రం ప్రధాన లక్ష్యమన్నారు. బాధితుల గోప్యత, గౌరవానికి ప్రాధాన్యతనిస్తూ సున్నితమైన విధానంతో వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. బాధితులకు సత్వర సహాయం అందేలా సంబంధిత శాఖలతో సమన్వయం చేయాలని అన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే సేవా దృక్పథంతో మరింత సమర్థవంతంగా పనిచేస్తూ.. బాధితులకు వేగవంతమైన, నాణ్యమైన సేవలు అందించాలని అదనపు ఎస్పీ సూచించారు. కార్యక్రమంలో ఎసై సుచరిత, భరోసా కోఆర్డినేటర్ సౌమ్య, భరోసా కేంద్రం సిబ్బంది, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వానికి ప్రజలకు మీడియా వారధిగా ఉండాలి




- ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరవేయడంలో మీడియా సహకారం మరువలేనిది.
- పాత్రికేయుల సమస్యలపై సానుకూలంగా స్పందించిన జిల్లా కలెక్టర్.
- కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన నూతనంగా ఎన్నికైన ప్రెస్ క్లబ్ కార్యవర్గం.
- నూతనంగా ఎంపికైన మెదక్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు, కార్యదర్శులకు సన్మానం.

**మెదక్ ఆగష్టు,07(సిరి న్యూస్)**

ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా మీడియా సహకారం ఉండాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పేర్కొన్నారు. మెదక్ ప్రెస్ క్లబ్ నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు నరసింహ చారి,ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర్,కార్యవర్గం శుక్రవారం మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ ను మర్యాద పూర్వకంగా కలిశారు.జిల్లా కలెక్టర్ వారికి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా పాత్రికేయ మిత్రులు వారి సమస్యలను కలెక్టర్ కు విన్నవించగా సానుకూలంగా స్పందించారు. ప్రభుత్వానికి ప్రజలకు వారధిల పాత్రికేయులు పనిచేస్తారని, ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో మీడియా పాత్ర మరువలేనిదన్నారు. వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని కలెక్టర్ వివరించారు.

## కనిపించకుండా పోయిన ముగ్గురు విద్యార్థులు..

### రామాయంపేట కెసిఆర్ కాలనీలో కలకలం.. విచారణ జరుగుతున్న పోలీసులు





**రామాయంపేట, ఆగస్టు 7 (సిరి న్యూస్)**

రామాయంపేట పట్టణంలోని కెసిఆర్ కాలనీకి చెందిన ముగ్గురు బాలురు కనిపించకుండా పోవడం కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..కాలనీకి చెందిన మెక్కొండ అశ్విని అలియాస్ సోనీ కుమారుడు ధనుష్ (13) రామాయంపేట ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. అలాగే అదే కాలనీకి చెందిన ఆరే గీత కుమారుడు మనోజ్ (13) 8వ తరగతి, రూబీన కుమారుడు షేక్ సమీర్ (13) 9వ తరగతి చదువుతున్నారు.గురువారం రాత్రి సుమారు 9 గంటల వరకు కాలనీలో కలిసి ఆడుకున్న ముగ్గురు బాలురు అనంతరం ఎవరికి చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయి కనిపించకుండా పోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ముగ్గురు బాలుర ఆచూకీ గురించి ఎవరికైనా సమాచారం తెలిసినట్లయితే వెంటనే రామాయంపేట పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

## ప్రజల బాటలో సీపీఐ పాదయాత్ర..

- ప్రజా సమస్యలపై సీపీఐ పాదయాత్ర జోరు..
- కేంద్ర విధానాలపై సీపీఐ విమర్శలు..
- భీమినిలో ప్రజలతో మమేకమైన సీపీఐ నాయకులు..




**మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 07 (సిరి న్యూస్)**

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) చేపట్టిన పాదయాత్ర రెండో రోజు భీమిని మండల కేంద్రంలో కొనసాగింది. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలతో సామాన్యులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఐ నాయకులు విమర్శించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడమే పాదయాత్ర ఉద్దేశమన్నారు. సీపీఐ జాతీయ కమిటీ పిలుపు మేరకు ఆగస్టు 6 నుంచి 14 వరకు బెల్లంపల్లి నియోజకవర్గంలోని భీమిని, కన్నెపల్లి మండలాల్లో ఈ పాదయాత్ర కొనసాగుతోంది. రైతులకు గిట్టుబాటు ధరలు, వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ పనిదినాలు, కూలీల వేతనాల పెంపు, నిరుద్యోగులకు ఉద్యోగాలు, ఖాళీ ప్రభుత్వ పోస్టుల భర్తీ, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, ఆస్పత్రుల బలోపేతం, మహిళల భద్రత, పేదలకు ఇళ్లు, తాగునీరు, రహదారులు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో ప్రజలను కలిసి సమస్యలను తెలుసుకుంటూ ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయడమే ఈ పోరాట యాత్ర లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో బొల్లం పూర్ణిమ, ఆడెపు రాజమౌళి, కొండు బానేశ్, బొంతల లక్ష్మీనారాయణ, గుండా చంద్ర మాణిక్యం, రత్నం రాజం, బొల్లం తిలక్ అంబేద్కర్, శీలం చంద్రయ్య, దాసరి లక్ష్మి, కామెరా దుర్గయ్య, మీసాల సన్యాసి, బెద్దల బాలయ్య పాల్గొన్నారు.

# జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ రమేష్ పై సస్పెన్షన్



- ఒకరి బదులు మరొకరు విధులు నిర్వహించారన్న ఆరోపణ
- ఆసుపత్రి సంఘటనపై మంత్రి దామోదర్ సీరియస్
- చర్చనీయాంశంగా మారిన ఆసుపత్రి ఘటన



**జోగిపేట, ఆగస్టు 07, (సిరి న్యూస్):**

జోగిపేట ఏరియా అసుపత్రిలో ఒకరిబదులుగా మరొకరిని డాక్టర్ సీటులో కూర్చొబెట్టి విధులకు గైర్హాజరయ్యారన్న ఆరోపణలపై డిప్యూటీ సివిల్ సర్జన్ (జనరల్ మెడిసిన్)గా పనిచేస్తున్న డాక్టర్ రమేష్‌ను సస్పెండ్ చేస్తూ ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తు శుక్రవారం ఉత్తర్వులను జారీ చేసారు. ఈ సంఘటన జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈనెల 5వ తేదిన 24 గంటల పాటు విధులు నిర్వహించాల్సిన డాక్టర్ రమేశ్ సాయత్రం 7 గంటల తర్వాత తినడానికి వెళ్లినప్పుడు క్యాజువాలిటీ వార్డులోని డాక్టర్ సీటుపై డెంటల్ డాక్టర్ రవి ఆశీనులై ఉన్నారు. ఈ విషయాన్ని ఆసుపత్రికి చెందిన అధికారులే సంగారెడ్డిలోని పత్రికా విలేకరులకు సమాచారం ఇచ్చారు. వారు వెంటనే డాక్టర్ రమేశ్‌కు ఫోన్ చేసి ఎక్కడున్నావ్..ఈ రోజు నీ డ్యూటీనే కదా అని విలేకరులు ప్రశ్నించగా అవును తినడానికి వచ్చాను. వెళతానని చెప్పి తిరిగి 9 గంటల వరకు ఆసుపత్రికి చేరుకొని ఉదయం వరకు విదులను నిర్వహిచారు. కానీ అప్పటికే కూర్చీపై కూర్చున్న ఆసుపత్రికి సంబంధం లేని డాక్టర్ ఫోటో సంగారెడ్డిలోని విలేకరులకు చేరింది. ఈ విషయం అంతా అధికారులకు చేరడంతో యుద్దప్రాతిపతికను ఎలాంటి వివరణ కోరకుండానే సస్పెన్షన్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసారు. అయితే ఆ డాక్టర్ మాత్రం తన కోసమే ఆసుపత్రికి వచ్చాడని రమేశ్ డాక్టర్ చెప్పడం విశేషం.

మంత్రి దామోదర్ సీరియస్ జోగిపేట ఏరియా అసుపత్రిలో జరిగిన సంఘటనపై రాష్ట్ర మంత్రి దామోదర్ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసినట్లు తెలిసింది. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణను చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకొవాలని ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తును ఆదేశించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా ఎవరూ వ్యవహరించిన వారిపై చట్టపరమైన చర్యలుంటాయని ఆయన హెచ్చరించారు.

**ఆసుపత్రి సూపరిండెంట్‌పై చర్యలు?**

ఆసుపత్రిలో ఇంత తతంగం జరుగుతున్నా ఆసుపత్రి సూపరిండెంట్ పట్టీపట్టనట్లుగా వ్యవహరించడంపై అధికారులు సీరియస్‌గా పరిగనిస్తున్నారు. ఆమెపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో తెలపాలని షోకాజ్ నోటీసు జారీ అయ్యే అవకాశం ఉందని తెలుస్తుంది. ప్రతి రోజు డాక్టర్‌ల సంతకాల రిజిష్టర్‌ను పరిశీలించాల్సిన ఆమె నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు ఈ వ్యవహారంతో తేలిపోయింది. ఆమె కూడా విధులకు సరిగ్గా హజరుకాకుండానే రిజిష్టర్‌లో మరుసటి రోజు వచ్చి సంతకాలు పెట్టినట్లుగా ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. డెంటల్ డాక్టర్ చాలా కాలంగా ఆసుపత్రి రిలీవర్‌గా పనిచేస్తున్న విషయం సూపరిండెఉంట్‌తో పాటు ఆర్ఎంఓకు సమాచారం ఉన్నా రమేశ్ డాక్టర్‌ను టార్గెట్ చేసి ఈ విషయాన్ని పత్రికా కార్యాలయాలకు లీకులు ఇచ్చారని తెలుస్తుంది. ఈ వ్యవహరంలో మరో డాక్టర్ శివశంకర్‌రెడ్డి కూడా డెంటల్ డాక్టర్‌ను వాడుకున్నా బయటకు పొక్కకపోవడం విశేషం.



**విధుల పట్ట నిర్లక్ష్యం వహించలేదు....డాక్టర్ రమేశ్**

తాను 5వ తేదిన ఉదయం నుంచి సాయంత్రం 7 గంటల వరకు విధులను నిర్వహించి బోజనం చేసేందుకు వెళ్లి తిరిగి వచ్చే సరికి రెండు గంటల సమయం పట్టిందని అంతలోనే ఆసుపత్రిలో ఉద్దేశ పూర్వకంగానే రచ్చ చేయించారు. తాను రాత్రి 9 గంటల వరకు ఆసుపత్రికి చేరుకొని ఉదయం వరకు విధులను నిర్వహించానని, ఈ విషయం ఆసుపత్రి సిబ్బందిని అడిగితే తెలుస్తుందన్నారు. గతంలో జోగిపేట ఆసుపత్రి సూపరిండెంట్‌గా సమర్థవంతంగా పనిచేసానని, స్థానికంగా కూడా మంచి పేరు సంపాదించానన్నారు. కుట్ర పూరితంగానే ఈ వ్యవహారం జరిగిందన్నారు.

# కుటుంబ తగాదాతో వెళ్తే జీవితాన్ని నాశనం చేశాడు

- మోసపోయిన మహిళ ఆవేదన
- అధికారం అండతో అన్యాయం
- జయలక్ష్మినగర్ మహిళా కన్నీటి కథ
- ఖాకి చొక్కా వెనుక నల్లటి కోణం
- గర్భవతిని చేసి బలవంతపు అబార్షన్
- మోసం వంటి తీవ్రమైన నేరాల కింద ఎఫ్ఐఆర్
- ఆగస్టు 6న నమోదైన ఫిర్యాదు
- అమీన్పూర్ లో తీవ్ర సంచలనం
- మాజీ సీఐ పాపాలు బట్టబయలు

**అమీన్ పూర్ ఆగస్టు 07 సిరి న్యూస్**




అమీన్పూర్ సర్కిల్ పరిధిలోని బీరంగూడ జయ లక్ష్మీ నగర్ లో నివాసముంటున్న ఒక మహిళ ఆగస్టు 6 న రాత్రి 8 గంటల సమయంలో పోలీసులకు ఫిర్యాదు చేసింది. గతంలో కుటుంబ తగాదా విషయంలో పోలీస్ స్టేషన్కు వెళ్లిన సమయంలో అక్కడ విధులు నిర్వహిస్తున్న మాజీ ఇన్స్పెక్టర్ తనకు న్యాయం చేస్తానని, నమ్మబలికి బలహీనతను ఆసరాగా చేసుకుని వికృతలకు పాల్పడ్డాడు అని తెలిపారు. నమ్మించి మోసం బలవంతపు అబార్షన్, న్యాయం చేస్తానని నమ్మించి లైంగిక దాడికి పాల్పడడమే కాకుండా, గర్భం దాల్చిన తర్వాత బలవంతంగా గర్భస్రావం చేయించిన మాజీ ఇన్స్పెక్టర్. ఖాకి చొక్కా వెనుక నల్లటి కోణం ప్రజా రక్షణ బాధ్యతలో ఉండి అధికార దుర్వినియోగానికి పాల్పడిన మాజీ అధికారి పాపాలు బట్టబయలు, ఎఫ్ ఐ ఆర్ నమోదు, దర్యాప్తు ప్రారంభం బాధితురాలు వాంగ్మూలం, లభించిన ఆధారాల ప్రకారం అమీన్పూర్ ఇన్స్పెక్టర్ పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. దర్యాప్తులో లభించే సాక్షాదారాల ఆధారంగా చట్టపరమైన తదుపరి చర్యలు తీసుకోబడతాయని ఆయన తెలిపారు.

# యాదిలో గద్దారన్న..!



- ప్రజా హక్కుల కోసం జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు గద్దర్.
- తెలంగాణ ఏర్పాటులో గద్దర్ పాటలు ఉద్యమ స్ఫూర్తిని రగిలించాయి.
- గద్దర్ ఆశయాలను భావితరాలకు అందించాలి.
- మెదక్ జిల్లాకు గద్దర్ పేరు పెట్టాలి.
- పాఠ్యపుస్తకాల్లో గద్దర్ జీవిత చరిత్ర చేర్చాలి.
- తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్ పర్సన్ డాక్టర్ గుమ్మడి వెన్నెల.

**మెదక్, ఆగస్టు 07(సిరి న్యూస్)**

తెలంగాణ పోరాట యోధుడు ప్రజాకవి గద్దర్ ఆశయాలు నేటి యువతకు దిక్సూచిగా నిలవాలని తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ డాక్టర్ గుమ్మడి వెన్నెల అన్నారు.గద్దర్ మూడవ వర్ధంతి సందర్భంగా శుక్రవారం మెదక్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయనున్న గద్దర్ విగ్రహ స్థలంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇటీవల నూతనంగా ఎన్నికైన మెదక్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు శివన్నగారి నరసింహచారి, ప్రధాన కార్యదర్శి బచ్చు సంగమేశ్వర్‌లను డాక్టర్ గుమ్మడి వెన్నెల శాలువాలతో సన్మానించి అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ. పేద, బడుగు, బలహీన వర్గాలు, అణగారిన ప్రజల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడు గద్దర్ అని కొనియాడారు. తన ఆట, పాటలతో దోపిడీ వ్యవస్థను ప్రశ్నించి ప్రజల్లో చైతన్యం నింపిన ప్రజా యుద్ధనౌకగా ఆయన చిరస్థాయిగా నిలిచారని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో గద్దర్ పాటలు ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని రగిలించి ఉద్యమానికి ఊపిరి పోశాయని అన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం కోసం గద్దర్ చూపిన మార్గాన్ని భావితరాలు కొనసాగించాలని, యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. గద్దర్ జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని, ఆయన జన్మించిన మెదక్ జిల్లాకు గద్దర్ పేరు పెట్టాలని, హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై గద్దర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ప్రజా సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మెదక్ ప్రెస్ క్లబ్ కోశాధికారి అశోక్, సీనియర్ జర్నలిస్టులు బాలేశ్వర్‌రావు,శంకర్ దయాళ్ చారి,ఫారుక్ హుస్సేన్, చింతల రమేష్, నర్సింలు, చల్ల రాహుల్, దౌలయ్య, సిద్దేశం, లక్ష్మణ్, శ్రీహరి, కృష్ణమూర్తి, కార్తీక్, శ్రీకాంత్, మున్సిపల్ కౌన్సిలర్లు గంట సంపత్, జుబేర్, అస్తరు గల్లా బాల్‌రాజు, మాలల హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మల మైసయ్య, ఆకుల పెంటయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి గంగాధర్, కాంగ్రెస్ నాయకులు, రిటైర్డ్ ఉపాధ్యాయులు, బీఎస్పీ నాయకులు, దళిత ప్రజా సంఘాల నాయకులు, జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

# రోక్సీ అందానికి రహస్యం.. ఆకుకూరలు!

పాన్ ఇండియా సినిమా 'కల్కి2898ఏడీ'లో బ్యూటిఫుల్ హీరోయిన్ దిశా పటానీ.. రోక్సీ అనే పాత్రలో అలరించింది. మరి ఈ అమ్మడు అందానికి గల సీక్రెట్స్ ఏంటి? అని అడిగితే.. "అందానికే కాదు.. ఆరోగ్యానికి ప్రధానమైనది ఆహారమే. నేనైతే ఆకుకూరలు, పండ్లు ఇష్టంగా తింటా"నని గతంలోనే చెప్పింది. దాంతో మరిన్ని బ్యూటీ సీక్రెట్స్ పంచుకుంది. అవేంటో మీరూ తెలుసుకోండి.



## డైట్ ఇలా..

అందానికి, చర్మ సంరక్షణకు ఆహారం ఒక ముఖ్యపాత్ర పోషిస్తుందని నేను భావిస్తా. నాకు ఆకుకూరలు ఇష్టం. పండ్లు కూడా బాగా తింటాను. నీళ్లు ఎక్కువగా తాగుతుంటా. ఎప్పుడూ బాడీని హైడ్రేటెడ్‌గా ఉంచుకోవడానికి ఇష్టపడతా.

## హెయిర్ కేర్..

జుట్టు విషయానికి వస్తే.. కండిషనింగ్ చాలా ముఖ్యం. రోజూ జుట్టుకు నూనె రాయాలి. నేను బాదం నూనె వాడతా. అది జుట్టుకు పోషణనిస్తుంది. తేలికపాటి షాంపూ ఉపయోగిస్తా. అలాగే కండిషనర్ అప్లయ్ చేస్తా.

## స్కిన్ కేర్..

నేను సాధారణంగా బ్యూటీ ట్రీట్‌మెంట్‌ల జోలికి వెళ్లను. స్కిన్ కేర్ విషయానికొస్తే.. ముఖానికి మాయిశ్చరైజింగ్ చేయడం ముఖ్యం. నేను రోజూ బయటకు వెళ్లే ముందు, నిద్రపోయే ముందు మాయిశ్చరైజర్‌ని అప్లై చేస్తా. అలాగే, మంచి క్లెన్సర్‌తో నా ముఖాన్ని కడుక్కుంటాను. ఆపై పడుకునే ముందు ముఖంపై కొంచెం రోజ్ వాటర్ తో క్లీన్ చేస్తాను. ఫేస్ మాస్క్‌లను వేసుకోవడం నాకు చాలా ఇష్టం. ముఖ్యంగా పీల్ చేసేవి. ఇవి వాడడం చాలా ఈజీ. ఫేస్ వాష్, కోల్డ్ క్రీమ్, రోజ్ వాటర్, లిప్ బామ్, మస్కారా.. ఈ ఐదు ప్రతిరోజూ నా వెంట ఉంటాయి.

అందం విషయంలో నేను ఇచ్చే సలహా ఏంటంటే.. ఆరోగ్యంగా ఉండే ఆహారం తినండి. నీళ్లు బాగా తాగండి. ముఖాన్ని క్లీన్ చేయడం మర్చిపోవద్దు!



# స్నేక్ ప్లాంట్ తో సేఫ్ గా..

స్నేక్ ప్లాంట్.. ఈ మధ్య చాలా ఇండ్లలో కనిపిస్తోంది. ఇండోర్‌లో పెంచుకునే ఈ మొక్క ఇంట్లో ఉంటే అందంగా కనిపించడంతోపాటు.. బోలెడు ప్రయోజనాలు ఉన్నాయట. ''ఇంట్లోని గాలిని శుభ్రపరచడానికి ఈ మొక్క ఉండాలి'' అని నాసా జరిపిన పరిశోధనల్లో తేలింది. మరి ఆ మొక్క ఎందుకంత గొప్పదో..? దానివల్ల మనకు వచ్చే లాభాలేంటో తెలుసుకుందామా.



- ▲ సాధారణంగా ఒక మొక్క కార్బన్ డై ఆక్సైడ్ అనే విషవాయువును పీల్చుకుని, మనకు ఆక్సిజన్‌ను అందిస్తుంది. అయితే, పరిశ్రమల నుంచి విడుదలయిన ఫార్మాల్డిహైడ్, జైలీన్, టోలీన్, నైట్రోజన్ ఆక్సైడ్.. వంటి రకరకాల విషపూరిత వాయువులు గాలిలో కలుస్తాయి. మరి వాటిని శుభ్రం చేయాలంటే ఎలా అని ఎప్పుడైనా ఆలోచించారా? ఆ గాలిని శుభ్రం చేయడంలో ఈ మొక్క చాలా బాగా ఉపయోగపడుతుందట.
- ▲ రూమ్ ఫ్రెష్‌నర్స్, దోమల బెడద తగ్గించుకోవడానికి ఉపయోగించే మస్కిటో కాయిల్స్.. వంటి వాటి నుంచి కూడా హానికర రసాయనాలు విడుదల అవుతాయి. వాటిని కూడా ఈ మొక్క ఈజీగా తొలగిస్తుంది. దాంతోపాటు టాయిలెట్ నుంచి వచ్చే దుర్వాసనను దూరం చేస్తుంది. అలాగే బాత్‌రూమ్‌లలోని హ్యుమిడిటీని కూడా తగ్గిస్తుంది.
- ▲ కొన్ని ఇళ్లలో వెంటిలేషన్ సరిగా ఉండదు. తాజా గాలి అనేది రావడం, పోవడం అనేది జరగదు. ఇలా గాలి ప్రసరణ సరిగ్గా లేకపోతే మనకు ఆక్సిజన్ సరిగా అందక ఇబ్బంది పడతాం. ఈ మొక్క ఉంటే ఆ సమస్య ఉండదు. ఇది మూసి ఉన్న గదిలోని కార్బన్ డయాక్సైడ్‌ను పీల్చుకొని ఆక్సిజన్‌ను విడుదల చేస్తుంది. రాత్రుళ్లు ఈ ప్రక్రియ మరింత వేగవంతంగా జరుగుతుంది.
- ▲ పొడిగాలి వల్ల అప్పుడప్పుడూ అలర్జీలు వస్తుంటాయి. ఈ మొక్క వాతావరణంలోకి తేమను ఉత్పత్తి చేస్తుంది. దానివల్ల అలర్జీ రాకుండా నివారిస్తుంది. అలాగే గాలి నాణ్యత సరిగ్గా లేకపోవడం వల్ల సిక్ బిల్డింగ్ సింట్రోమ్ (ఎస్‌బీఎస్) బారిన పడే అవకాశాలు ఉన్నాయి. దీనివల్ల చెవులు, ముక్కు, గొంతులో దురద రావడం, దగ్గు, నీరసం, వికారం, కడుపులో తిప్పుతున్నట్లు ఉండడం, ఏకాగ్రత కోల్పోవడం, కండరాల్లో నొప్పి.. వంటి లక్షణాలు కనిపిస్తాయి. వీటన్నింటికీ ఒకటే సొల్యూషన్.. అది ఈ మొక్క.
- ▲ చిన్నపిల్లలుండే ఇంటి పరిసరాల్లో ఈ మొక్కను ఉంచితే వారు ప్రశాంతంగా ఉండేలా చేస్తుందట! అయితే ఈ మొక్క ఆకులు విషపూరితం. కాబట్టి ఇంటి బయట వాకిట్లో అమర్చితే చిన్నారులు, పెంపుడు జంతువులకు దూరంగా ఉండొచ్చు. ఇంట్లోనే పెట్టుకోవాలంటే పిల్లలకు అందకుండా అమర్చాలి.
- ▲ ఈ మొక్కకు నీళ్లు పదే పదే పెట్టాల్సిన పనిలేదు. మొక్కకు పోషకాలు అందించే మట్టి పొడిగా ఉండేలా చూసుకోవాలి. ఇలా మట్టి పొడిగా ఉండడం వల్ల దానికి అవసరమైన పోషకాలు అందుతాయి. వెలుతురు ఉండాలి. కానీ సూర్యరశ్మి నేరుగా పడకూడదు. ఈ మొక్క ఆకుల్ని ఆయుర్వేద చికిత్సల్లో వాడుతుంటారు. ముఖ్యంగా చర్మ సంరక్షణకు, పాము కాటుకు విరుగుడుగా, కుష్టు వ్యాధి నివారణకు, కీళ్ల నొప్పులు వంటివి తగ్గడానికి వాడతారు.



# టిఫిన్ కోసం సూపర్ ఫుడ్

బ్రేక్ ఫాస్ట్ కొత్తగా కావాలి. అది ఈవెనింగ్ శ్నాక్ లా కూడా తినగలగాలి. చూడ్డానికి, తినడానికి ఈజీగా ఉండాలి. చిన్న పిల్లలు ఉన్న ఇంట్లో ఇలాంటి డిమాండ్లు కామన్. అంతెందుకు ఈ మధ్య పెద్దవాళ్లు కూడా ఇలానే కోరుకుంటున్నారు. మరి అలాంటి టిఫిన్ ఐటెమ్ ఏంటా? అని వెతికేవాళ్లకు ఇది బెస్ట్ ఆప్షన్. ఇంట్లో ఉండేవాటితోనే ఈజీగా చేసుకునే రెసిపీ సూజీ బాల్స్. మరి అందుకు కావాల్సిన పదార్థాలు, తయారీ విధానం ఎలాగో తెలుసుకుందాం.

## సూజీ బాల్స్

బొంబాయి రవ్వ (సూజీ) ఒకటిన్నర కప్పు
జీడిపప్పులు రెండు టేబుల్ స్పూన్లు
చిల్లీ ఫ్లేక్స్ ఒక టీస్పూన్
కొబ్బరి పొడి అర కప్పు
నూనె ఒక టేబుల్ స్పూన్
ఉప్పు, కొత్తిమీర,
కరివేపాకు – కావాల్సినంత
పసుపు, మిరియాల పొడి
ఒక్కోటి అర టీస్పూన్
పాలకూర, పెరుగు,
కాలీ ఫ్లవర్ – ఒక్కోటి అర కప్పు చొప్పున
ఆవాలు, అల్లంవెల్లుల్లి పేస్ట్,
ధనియాల పొడి ఒక్కో టీస్పూన్ చొప్పున
జీలకర్ర, పసుపు, కారం, గరం మసాలా
ఒక్కోటి అర టీస్పూన్ చొప్పున
క్యారెట్, క్యాప్సికం, మీల్‌మేకర్
ఒక్కోటి పావు కప్పు చొప్పున



## తయారీ విధానం :



ఒక గిన్నెలో బొంబాయి రవ్వ, ఉప్పు, పెరుగు, పసుపు, మిరియాల పొడి వేసి నీళ్లు పోసి బాగా కలిపి ముద్ద చేయాలి. పావుగంటపాటు పక్కన పెట్టాలి. నూనె వేసి, అది వేడయ్యాక ఆవాలు, జీలకర్ర, అల్లం, వెల్లుల్లి పేస్ట్ ఒక్కోటిగా వేసి వేగించాలి. అందులో క్యారెట్, క్యాప్సికం, మీల్‌మేకర్ తరుగు ఒక్కోటిగా వేసి వేగించాలి. తరువాత పసుపు, జీలకర్ర, పసుపు, కారం, గరం మసాలా, ధనియాల పొడి కూడా వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని చిన్న ఉండలుగా చేసి, ఆపై చిన్న చపాతీలా వత్తాలి. దాని మధ్యలో రెడీ చేసిపెట్టుకున్న వెజిటబుల్ స్టఫింగ్ పెట్టి మూసేయాలి. వాటిని పావుగంట సేపు ఆవిరి మీద ఉడికించాలి. కడాయిలో నెయ్యి వేడి చేసి, ఆవాలు, జీలకర్ర, కరివేపాకుతో పాటు చిల్లీ ఫ్లేక్స్, జీడిపప్పు తరుగు, కొబ్బరి పొడి వేసి వేగించాలి. అందులో ఉడికించిన ఉండల్ని వేసి కలిపితే.. రవ్వ ఖట్టా రెడీ.

The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY, editor BADHE JAYASHREE.

హత్నూర మండలంలో

# సర్పంచుల ఫోరం ఆత్మీయ సమ్మేళనం

- సర్పంచ్ ల ఫోరం మండలాధ్యక్షుడు మణిదీప్ ఆధ్వర్యంలో నిర్వహణ
- సర్పంచులకు సన్మానం
- ముఖ్య అతిథిగా ఆవుల రాజిరెడ్డి, సుహాసిని రెడ్డి, ఆంజనేయులు గౌడ్ హాజరు
- గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకమన్న నేతలు

3




www.siridaily.com

RNI TG TEL/ 26/A0381

సిరి

People's Voice వార్తపత్రిక

శనివారం
ఆగస్టు-08-2026

సంపుటి (Volume) : 2
సంచిక (Issue) 208

MEDAK, SANGAREDDY, SIDDIPET

పేజీలు : 4




# మృత్యు జంక్షన్!



## 24 గంటల్లోగా వై జంక్షన్ మూసేయాలి

- లేదంటే తామే మూసేస్తాం..
- హైవే అథారిటీ తక్షణమే స్పందించాలి
- బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు హెచ్చరిక

4

కాళ్లు విరిగి మహిళలకు తీవ్ర గాయాలు

శాశ్వత భద్రతా చర్యలు చేపట్టని అధికారులు

వై జంక్షన్ మూసివేతే పరిష్కారం అంటున్న ప్రజలు

రామాయంపేట, ఆగస్టు 7 (సిరి న్యూస్)

జాతీయ రహదారి (ఎన్ హెచ్ 44) రామాయంపేట వై జంక్షన్ వద్ద ప్రమాదాల పరంపరకు అడ్డుకట్ట పడడం లేదు. మెదక్ జిల్లా రామాయంపేట 44వ జాతీయ రహదారిపై ఉన్న వై జంక్షన్ మరోసారి ప్రమాదానికి వేదికగా మారింది. మూడు రోజుల క్రితం విద్యార్థులతో వెళ్తున్న ఆటో ప్రమాదానికి గురై 14 మంది గాయపడిన ఘటన మరువకముందే, శుక్రవారం మరో ఘోర ప్రమాదం చోటుచేసుకోవడంతో స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరుస ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ అధికారులు శాశ్వత చర్యలు చేపట్టకపోవడంపై ప్రజలు మండిపడుతున్నారు. వాహనాలు అధిక వేగంతో పోకుండా ఉండడం కోసం పోలీసులు హైవేపై డ్రమ్ములను ఏర్పాటు చేశారు. ఈ విషయంలో ఇంకా ఎలాంటి చర్యలు చేపడితే రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయి అనే విషయంపై పోలీస్ శాఖ, ఇతర శాఖల అధికారులు తర్జన భర్జన ప్రజలు పడుతున్నారు. అయితే వై జంక్షన్ మూసివేత ఒకటే పరిష్కారం అని పలువురు భావిస్తున్నారు.

4



## సాగునీటి కోసం ఉమ్మడి జిల్లాలో ఉత్కంఠ

- బసవేశ్వర, సంగమేశ్వర ఎత్తిపోతల పథకాలను వెంటనే ప్రారంభించాలి!
- సింగూరు జలాల సాధన కమిటీ అధ్యక్షులు కే బ్రహ్మం డిమాండ్
- సంగారెడ్డి జిల్లా కలెక్టర్, ఇరిగేషన్ అధికారులకు వినతిపత్రం సమర్పణ

2

## కేసీఆర్ నాయకత్వమే తెలంగాణకు భరోసా

- రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమే..
- కేసీఆర్ మళ్లీ సీఎం కావడం ఖాయం
- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంఠరెడ్డి తిరుపతిరెడ్డి
- సుతార్ పల్లి నుంచి బీఆర్ఎస్ శ్రేణుల భారీ రాక

2





అధికారుల నిర్లక్ష్యం..

## ప్రజలే రోడ్డు మరమ్మతులకు శ్రీకారం

2

- రాయసముద్రం చెరువు కట్ట రహదారిలో భారీ గుంతలు
- సొంత ఖర్చుతో పూడ్చిన యువకులు
- వెన్నవరం సంతోష్ రెడ్డి సేవాభావం







# కేసీఆర్ నాయకత్వమే తెలంగాణకు భరోసా

- రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమే..
- కేసీఆర్ మళ్లీ సీఎం కావడం ఖాయం
- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంఠరెడ్డి తిరుపతిరెడ్డి
- సుతార్ పల్లి నుంచి బీఆర్ఎస్ శ్రేణుల భారీ రాక

రామాయంపేట, ఆగస్టు 7 (సిరి న్యూస్)

తెలంగాణ ప్రజల విశ్వాసం బీఆర్ఎస్‌పైనే ఉందని, రాబోయే ఎన్నికల్లో పార్టీ ఘనవిజయం సాధించి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడం ఖాయమని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంఠరెడ్డి తిరుపతిరెడ్డి అన్నారు. రామాయంపేట మండలం సుతార్ పల్లి గ్రామానికి చెందిన సుమారు 50 మంది బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం ఆయనను వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కంఠరెడ్డి తిరుపతి రెడ్డి మాట్లాడుతూ.. "కేసీఆర్ నాయకత్వమే తెలంగాణకు భరోసా.. రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమే. కేసీఆర్ మళ్లీ సీఎం కావడం ఖాయం"అని ధీమా వ్యక్తం చేశారు.పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మంత్రి కేటీఆర్, మాజీ మంత్రి హరీష్‌రావు నాయకత్వంలో ప్రతి గ్రామంలో పార్టీని మరింత బలోపేతం చేయాలని, కార్యకర్తలే పార్టీకి నిజమైన బలమని పేర్కొన్నారు. పార్టీ జెండా కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు బీఆర్ఎస్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.అనంతరం సుతార్ పల్లి నాయకులు, కార్యకర్తలతో సమావేశమైన కంఠరెడ్డి తిరుపతిరెడ్డి వారి అభిప్రాయాలను తెలుసుకుని, రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయానికి సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామంలో పార్టీని మరింత బలోపేతం చేసి విజయానికి ప్రతి కార్యకర్త అంకితభావంతో పని చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రామాయంపేట మండల మాజీ రైతుబంధు అధ్యక్షుడు బానప్పగారి నర్సారెడ్డి, మాజీ ఎంపీటీసీ బిక్షపతి, మెదక్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాణిక్యరెడ్డి, నాయకులు సంతోష్‌రెడ్డి, నాగరాజు, జయరాంరెడ్డి, ఏర్పుల స్వామి, అక్కల స్వామి, పులిమామిడి ఏసు, దాకుల సత్తయ్య, సిద్ధ రాములు,ఆర్‌సి నర్సింలు, స్వామి అంజయ్య, దేవారం రాగి అంజయ్య, పి. స్వామి, వార్డు సభ్యుడు స్వామి దయాకర్, పి. పోచయ్య, శ్రీశైలం, ఆర్‌పి ఈశ్వర్, రమేష్, సత్తయ్యతో పాటు పెద్ద కార్యకర్తలు పాల్గొన్నారు.




# సాగునీటి కోసం ఉమ్మడి జిల్లాలో ఉత్కంఠ

- బసవేశ్వర, సంగమేశ్వర ఎత్తిపోతల పథకాలను వెంటనే ప్రారంభించాలి..!
- సింగూరు జలాల సాధన కమిటీ అధ్యక్షులు కే బ్రహ్మం డిమాండ్
- సంగారెడ్డి జిల్లా కలెక్టర్, ఇరిగేషన్ అధికారులకు వినతిపత్రం సమర్పణ



**సంగారెడ్డి, ఆగస్టు 07:** ఉమ్మడి జిల్లాల రైతులకు సాగునీరు అందించే లక్ష్యంతో ప్రతిష్టాత్మకంగా మంజూరైన బసవేశ్వర, సంగమేశ్వర ఎత్తిపోతల పథకాల పనులను ప్రభుత్వం వెంటనే పునఃప్రారంభించాలని సింగూరు జలాల సాధన కమిటీ అధ్యక్షులు కే బ్రహ్మం డిమాండ్ చేశారు. గురువారం సంగారెడ్డి జిల్లా కలెక్టర్, ఇరిగేషన్ పర్యవేక్షణ అధికారికి సింగూరు జలసాధన సమితి కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సింగూరు జల సాధన సమితి అధ్యక్షులు కే బ్రహ్మం మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర రావు చేతుల మీదుగా ఈ ప్రాజెక్టులకు శంకుస్థాపనలు జరిగాయని గుర్తుచేశారు. సింగూరు జలాల సాధన కమిటీ ఆధ్వర్యంలో జరిగిన పోరాటాల ఫలితంగానే అప్పట్లో ఈ పథకాలు మంజూరయ్యాయని ఆయన స్పష్టం చేశారు.



సింగూరు ప్రాజెక్టు వివరాలు (జీవో నెం. 337 -సంవత్సరం 2021) సంగమేశ్వర ఎత్తిపోతల పథకం సుమారు 2,19,000 ఎకరాల సాగునీటి లక్ష్యంతో రూ. 2,653 కోట్లు మంజూరు. బసవేశ్వర ఎత్తిపోతల పథకంకు రూ. 1,774 కోట్లు కేటాయింపు. ఈ ప్రాజెక్టులకు సంబంధించి టెక్నికల్ శాంక్షన్ పూర్తి కావడంతో పాటు, టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లకు కూడా పనులు అప్పగించినట్లు కే బ్రహ్మం తెలిపారు. అయితే, ప్రభుత్వం మారిన తర్వాత ఈ పనులు పూర్తిగా నిలిచిపోవడంపై ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం స్థానిక మంత్రిగా ఉన్న దామోదర్ రాజనర్సింహ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తమ ఉద్యమానికి మద్దతు తెలిపారని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ ప్రాజెక్టులను పట్టించుకోకపోవడం వల్ల లక్షలాది ఎకరాలకు అందాల్సిన సాగునీరు నిలిచిపోయిందని ఆయన విమర్శించారు. ఈ ఎత్తిపోతల పథకాల ద్వారా ఆందోల్ నియోజకవర్గంతో పాటు నారాయణఖేడ్, జహీరాబాద్, సంగారెడ్డి నియోజకవర్గాల పరిధిలోని సుమారు మూడు లక్షల ఎకరాలకు పైగా వ్యవసాయ భూములకు సాగునీరు అంది రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని ఆయన పేర్కొన్నారు. నిలిచిపోయిన ఈ పనులకు వెంటనే మోక్షం కల్పించి, యుద్ధప్రాతిపదికన పనులను వేగవంతం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎస్. నరసింహులు, యాదయ్య, పెద్ద సంఖ్యలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

## అధికారుల నిర్లక్ష్యం.. ప్రజలే రోడ్డు

# మరమ్మతులకు శ్రీకారం

- రాయసముద్రం చెరువు కట్ట రహదారిలో భారీ గుంతలు
- సొంత ఖర్చుతో పూడ్చిన యువకులు
- వెన్నవరం సంతోష్ రెడ్డి సేవాభావం



**రామచంద్రాపురం, ఆగస్టు 7 (సిరి న్యూస్):** రామచంద్రాపురం నుంచి రామచంద్రారెడ్డి నగర్ కాలనీ వరకు రాయసముద్రం చెరువు కట్టపై ఉన్న రహదారి భారీ గుంతలతో అధ్వాన్నంగా మారింది. దీంతో ప్రతిరోజూ ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందన లేకపోవడంతో స్థానికులే రహదారి మరమ్మతులకు పూనుకున్నారు. రామచంద్రారెడ్డి నగర్ కాలనీకి చెందిన వెన్నవరం సంతోష్ రెడ్డి తన స్నేహితులతో కలిసి సొంత ఖర్చుతో రహదారిలోని గుంతలను పూడ్చివేశారు. ప్రజల కోసం వారు చేపట్టిన ఈ కార్యక్రమాన్ని స్థానికులు అభినందించారు. అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలే రోడ్లను బాగు చేసుకోవాల్సిన పరిస్థితి రావడం దురదృష్టకరమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. రాయసముద్రం చెరువు కట్టపై ఉన్న రహదారికి తక్షణమే శాశ్వత మరమ్మతులు చేపట్టి, వాహనదారులకు సురక్షిత ప్రయాణం కల్పించాలని సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు.





- సర్పంచ్ ల ఫోరం మండలాధ్యక్షుడు మణిదీప్ ఆధ్వర్యంలో నిర్వహణ
- సర్పంచులకు సన్మానం
- ముఖ్య అతిథిగా ఆవుల రాజిరెడ్డి, సుహాసిని రెడ్డి, ఆంజనేయులు గౌడ్ హాజరు
- గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకమన్న నేతలు

### హత్నూర మండలంలో

# సర్పంచుల ఫోరం ఆత్మీయ సమ్మేళనం

హత్నూర, ఆగస్టు 7 (సిరి న్యూస్): గ్రామాల అభివృద్ధికి సర్పంచుల పాత్ర అత్యంత కీలకమని, ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే మొదటి ప్రజాప్రతినిధులు సర్పంచులేనని నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. శుక్రవారం హత్నూర మండలంలోని దౌల్తాబాద్ సమీపంలో ఉన్న వివిఎస్ఆర్ ఫంక్షన్ హాల్లో సర్పంచ్ ల ఫోరం మండలాధ్యక్షుడు చార్ల మణిదీప్ ఆధ్వర్యంలో సర్పంచుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి, మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శివన్న గారి ఆంజనేయులు గౌడ్, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హత్నూర మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులను శాలువాలతో ఘనంగా సన్మానించి, జ్ఞాపికగా పెన్నులు అందజేశారు. గ్రామాల అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న ప్రజాప్రతినిధుల సేవలను కొనియాడుతూ నిర్వాహకులు అభినందనలు తెలిపారు. గ్రామభివృద్ధి కేవలం నిధులతోనే సాధ్యం కాదని, ప్రజల సహకారం, అధికారుల సమన్వయం, సర్పంచుల అంకిత భావం కలిసి వచ్చినప్పుడే గ్రామాలు అన్ని రంగాల్లో ముందుకు సాగుతాయని ఆవుల రాజిరెడ్డి అన్నారు. పరిమిత నిధులు, పెరుగుతున్న ప్రజా అవసరాలు, పరిపాలనా సవాళ్ల మధ్య సర్పంచులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి పల్లి ఆంజనేయులు, ఇతర నాయకులు మాట్లాడుతూ.. ప్రజా అభీష్టం మేరకు ఎన్నికైన సర్పంచులు పార్టీలకతీతంగా, నిష్పక్షపాతంగా ప్రజలకు సేవలందించి గ్రామాలను అభివృద్ధి బాటలో నిలపాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లోని నాయకులు వివిధ పార్టీలపై అసత్య ఆరోపణలు చేస్తూ కాలయాపన చేయకుండా గ్రామాన్ని ఎలా అభివృద్ధి చేసుకోవాలో ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. నాయకులు తమ పార్టీల జెండాను, అజెండాను పక్కనబెట్టి కలిసికట్టుగా ఐక్యమత్యంతో కృషి చేస్తేనే గ్రామం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మండల ఉపాధ్యక్షుడు యాదగిరి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణ, వివిధ గ్రామాల సర్పంచ్లు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.











# మృత్యు జంక్షన్!

**మూడు రోజుల్లో వై జంక్షన్ వద్ద రెండు ప్రమాదాలు**

- కాళ్లు విరిగి మహిళలకు తీవ్ర గాయాలు
- శాశ్వత భద్రతా చర్యలు చేపట్టని అధికారులు
- వై జంక్షన్ మూసివేతే పరిష్కారం అంటున్న ప్రజలు

**రామాయంపేట, ఆగస్టు 7 (సిరి న్యూస్)** జాతీయ రహదారి (ఎన్ హెచ్ 44) రామాయంపేట వై జంక్షన్ వద్ద ప్రమాదాల పరంపరకు అడ్డుకట్ట పడడం లేదు. మెదక్ జిల్లా రామాయంపేట 44వ జాతీయ రహదారిపై ఉన్న వై జంక్షన్ మరోసారి ప్రమాదానికి వేదికగా మారింది. మూడు రోజుల క్రితం విద్యార్థులతో వెళ్తున్న ఆటో ప్రమాదానికి గురై 14 మంది గాయపడిన ఘటన మరువకముందే, శుక్రవారం మరో ఘోర ప్రమాదం చోటుచేసుకోవడంతో స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరుస ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ అధికారులు శాశ్వత చర్యలు చేపట్టకపోవడంపై ప్రజలు మండిపడుతున్నారు. వాహనాలు అధిక వేగంతో పోకుండా ఉండడం కోసం పోలీసులు హైవేపై డ్రమ్ములను ఏర్పాటు చేశారు. ఈ విషయంలో ఇంకా ఎలాంటి చర్యలు చేపడితే రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయి అనే విషయంపై పోలీస్ శాఖ, ఇతర శాఖల అధికారులు తర్జన భర్జన ప్రజలు పడుతున్నారు. అయితే వై జంక్షన్ మూసివేత ఒకటే పరిష్కారం అని పలువురు భావిస్తున్నారు. గతంలో కొన్ని రోజులపాటు వై జంక్షన్ మూసి వేసిన సందర్భంలో ఒక్క ప్రమాదం కూడా జరగలేదని స్థానికులు తెలిపారు. ఇదిలా ఉండగా. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి నుంచి నార్సింగి వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న నర్సింగ్ గ్రామానికి చెందిన భూమ నాగరాజు, ఆయన భార్య కళ్యాణి వై జంక్షన్ వద్దకు చేరుకోగానే వెనుక నుంచి వేగంగా వచ్చిన ఓ కారు బలంగా ఢీకొట్టింది. అనంతరం కారు ఆగకుండా అక్కడి నుంచి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో దంపతులిద్దరూ తీవ్రంగా గాయపడగా, కళ్యాణికి రెండు కాళ్ల ఎముకలు విరిగినట్లు వైద్యులు తెలిపారు. సమాచారం అందుకున్న స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ జంక్షన్ వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ భద్రతా ప్రమాణాలు అమలు చేయడంలో నిర్లక్ష్యం కొనసాగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. రహదారిపై వేగ నియంత్రణ కోసం రంబుల్ స్ట్రిప్స్, రేడియం స్టడ్స్, హెచ్చరిక బోర్డులు, ఫ్లాషింగ్ సిగ్నల్స్, సర్వీస్ రోడ్డుకు స్పష్టమైన సూచికలు వంటి ఏర్పాట్లు లేకపోవడం వల్లనే ప్రమాదాలు పునరావృతమవుతున్నాయని అంటున్నారు. మూడు రోజుల వ్యవధిలోనే రెండో ప్రమాదం జరగడం వై జంక్షన్ ప్రమాదకర పరిస్థితికి నిదర్శనమని ప్రజలు పేర్కొంటున్నారు. ఇకనైనా జాతీయ రహదారి అధికారులు, జిల్లా యంత్రాంగం స్పందించి శాశ్వత భద్రతా చర్యలు చేపట్టాలని, మరో ప్రాణం బలికాకముందే సమస్యకు పరిష్కారం చూపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.






# 24 గంటల్లోగా వై జంక్షన్ మూసేయాలి

- లేదంటే తామే మూసేస్తాం..
- హైవే అథారిటీ తక్షణమే స్పందించాలి
- బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు హెచ్చరిక

**రామాయంపేట, ఆగస్టు 7 ( సిరి న్యూస్)** రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణాలు తీస్తున్న వై జంక్షన్ వెంటనే మూసి వేయకపోతే, తామే రంగంలోకి దిగి మూసేస్తామని బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రామలు హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం వై జంక్షన్ వద్ద రోడ్డు ప్రమాదం జరిగిన దృష్ట్యా ఆయన వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని మాట్లాడారు. రామాయంపేట పట్టణంలోని ఎన్ హెచ్ 44 వై జంక్షన్ కూడలిదగ్గర దగ్గర ప్రమాదం జరిగిందని ,ఈ ప్రమాదంలో భార్యాభర్తలు ఇద్దరు కూడా తీవ్ర గాయాలై ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వారి భార్యను సిద్దిపేటకు తీసుకువెళ్లాలని డాక్టర్లు సూచించడం జరిగిందన్నారు. భారతీయ జనతా పార్టీ మొదటి నుంచి కూడా చెప్తా ఉందనీ, వై జంక్షన్ ను వెంటనే మూసేయాలని, ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని కోరారు. రెండు రోజుల కిందట తాము నేషనల్ హైవే అథారిటీ అధికారులకు క్లోజ్ చేయమని చెప్పామని చేయమని చెప్పామని, అయితే మూసివేతకు మేము ప్రయత్నించినప్పటికీ ఇబ్బందులకు గురిచేసారన్నారు .ఇట్టి సమాచారాన్ని ఎంపీ రఘునందన్ రావు గారికి పంపుతా ఉన్నాం ... దీనిపై నేషనల్ హైవే అథారిటీ తక్షణమే చర్యలు తీసుకొని 24 గంటల్లోగా ఎట్టి పరిసితు ల్లో క్లోజ్ చేయాలి ,లేకపోతే భారతీయ జనతా పార్టీ వాటిని మూసేయడానికి వెనకాడదు. అని రాములు హెచ్చరించారు.









# మేళ్ల చెరువు మురుగు నీటి మళ్లింపు పనులకు క్షేత్రస్థాయి సర్వే

- **అమృత్ 2.0 కింద రూ. 2.09 కోట్ల ప్రాజెక్టు.. అమలుకు ముందడుగు**

రామచంద్రపురం, ఆగస్టు 7 (సిరి న్యూస్): అమృత్ 2.0 పథకం కింద మేళ్ల చెరువులోకి చేరుతున్న మురుగు నీటిని మళ్లించేందుకు మంజూరైన రూ.2.09 కోట్ల ప్రాజెక్టు అమలులో భాగంగా శుక్రవారం పబ్లిక్ హెల్త్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ వైష్ణవి, పటాన్‌చెరు సర్కిల్ మున్సిపల్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లాపూర్ నెబర్‌హుడ్ అసోసియేషన్ (తేనా) అధ్యక్షుడు రమణ ఈశ్వరగారి మాట్లాడుతూ, అమృత్ 2.0 కింద మేళ్ల చెరువు మురుగు నీటి మళ్లింపు పనులకు రూ.2.09 కోట్లు మంజూరు కావడం అభినందనీయమన్నారు. ఈ నిధుల మంజూరుకు మెదక్ ఎంపీ ఎం. రఘునందన్ రావు చేసిన కృషి కీలకమని పేర్కొన్నారు. కాలుష్యానికి మూలమైన ప్రాంతం నుంచే మురుగు నీటి మళ్లింపు పైప్‌లైన్ పనులు ప్రారంభించాలని అధికారులను కోరారు. మూలంలోనే కాలుష్యాన్ని అరికట్టడం ద్వారా మాత్రమే మేళ్ల చెరువుకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అన్నారు. ప్రాజెక్టు పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేసి మేళ్ల చెరువును కాలుష్య రహితంగా తీర్చిదిద్దాలని సూచించారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే చెరువు పరిరక్షణకు ఊతమివ్వడంతో పాటు స్థానికులకు మెరుగైన పర్యావరణ పరిస్థితులు ఏర్పడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ తెల్లాపూర్ నీటి సంఘం అధ్యక్షుడు వడ్డేపల్లి నర్సింహులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

